epaper.samayamdaily.net
APTEL/2006/18267
# సమయం
మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
విలేకరులు కావలెను
తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.
7036644111, 9490140565

సంపుటి: 19 | సంచిక: 292 | ఎడిటర్ : అలీ ముర్తుజా | శనివారం 12 సెప్టెంబర్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల:రూ.5 |



## మూసీ ప్రాజెక్టుకు 'గ్రీన్' అడ్డంకులు!

రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్జీటీ నోటీసులు
అనుమతులను సవాల్ చేసిన రిటైర్డ్ ఇంజినీర్లు
55 కిలోమీటర్లకు 20 కిలోమీటర్లే అధ్యయనమంటూ అభ్యంతరం
తదుపరి విచారణ అక్టోబర్ 16కు వాయిదా

3

## 'తమ్ముడు.. లెట్స్ డూ కుమ్ముడు'!

- రేవంత్-పొంగులేటి కలిసి రాష్ట్రాన్ని దోచేస్తున్నారన్న కేటీఆర్
- భూ దందాలు.. కబ్జాలు పరాకాష్ఠకు చేరాయని ఆరోపణ
- తెరవెనుక సమాంతర రెవెన్యూ సామ్రాజ్యం నడుస్తోందని విమర్శ
- 'భూభారతి' పేరుతో ప్రజల భూములకు 'భూ హారతి' అన్న హరీశ్
- పొంగులేటి మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్

2

"తమ్ముడు.. లెట్స్ డూ కుమ్ముడు" అన్న రీతిలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెట్టాపట్టాలేసుకుని రాష్ట్రాన్ని దోచేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. రేవంత్ అధికారంలోకి వచ్చిన తర్వాత భూ దందాలు, ల్యాండ్ కబ్జాలు పరాకాష్ఠకు చేరాయని, అస్మదీయులకు దోచిపెట్టడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు.







## రేవంత్ డైరెక్షన్‌లోనే అంతా జరిగింది

- మహిళా ఎమ్మెల్యేలపై విచక్షణారహితంగా దాడి
- దేశంలోనే ఎక్కడాలేని విధంగా కౌరవసభ
- జాతీయ మహిళా కమిషన్‌కు సబితా ఫిర్యాదు

2

# చదువే తలరాతను మారుస్తుంది



### అందుకే విద్యాశాఖను నా దగ్గరే ఉంచుకున్నా
### పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యం
### విద్యా బడ్జెట్‌ను 15 శాతానికి పెంచాలన్నదే లక్ష్యం
### ప్రపంచంతో పోటీపడేలా విద్యా వ్యవస్థలో మార్పులు
### అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (సమయం న్యూస్):** "ఎంత ఆస్తి ఉన్నా చదువు లేకపోతే సామాజికంగా వెనుకబడిపోతాం. అక్షరం ఒక్కటే మనిషి జీవితాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్తుంది. విద్య ఒక్కటే మన తలరాతను మార్చగలదు" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పేదలకు మేలు జరగాలన్న ఉద్దేశంతోనే విద్యాశాఖను తన వద్ద ఉంచుకున్నానని స్పష్టం చేశారు. విద్యాశాఖకు పూర్తిస్థాయి మంత్రి లేరంటూ వస్తున్న విమర్శలను ప్రస్తావిస్తూ.. అంతకుమించి ముఖ్యమంత్రిగా తానే ఆ శాఖను పర్యవేక్షిస్తున్నానని చెప్పారు. విద్యపై తనకున్న ప్రత్యేక ఆసక్తే ఆ శాఖను తన వద్ద ఉంచుకోవడానికి కారణమన్నారు. శాసనసభలో విద్యారంగంపై జరిగిన చర్చలో సీఎం మాట్లాడుతూ.. భవిష్యత్ తరాల విద్య, విద్యా వ్యవస్థ

మిగతా 2 లో



## ప్రపంచం కంటే రెండింతల వేగంతో
# బ్రిక్స్ వృద్ధి!

- ప్రపంచ జీడీపీలో 40 శాతానికి పైగా వాటా
- ప్రపంచ జనాభాలో సగం బ్రిక్స్ దేశాల్లోనే
- ఆవిష్కరణలకు కీలక కేంద్రాలుగా ఎదుగుతున్న సభ్య దేశాలు
- వాణిజ్యం.. పెట్టుబడులు.. సాంకేతిక సహకారం పెరగాలి
- బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్‌లో ప్రధాని మోదీ

4



### విశ్వసనీయ వ్యాపార బంధాలే ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక

పాత ఆర్థిక శక్తుల స్థానంలో కొత్త శక్తులు
బ్రిక్స్ వాటా పెరుగుతోందన్న పుతిన్
జీ-7 వాటా 29 శాతానికే పరిమితమైందని వ్యాఖ్య

4

## కులగణన ఒక 'ఎక్స్‌రే'!

- తెలంగాణ సర్వే దేశానికే ఆదర్శం
- జనగణనలో కులగణన తప్పనిసరి చేయాలి
- బీజేపీ వైఖరి సూటిగా చెప్పాలి
- బలహీన వర్గాలకు న్యాయం కులగణనతోనే
- దేశ సంపద సమాన పంపిణీకి ఇదే మార్గం
- అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

దేశంలో సామాజిక అసమానతలను తొలగించి బలహీన వర్గాలకు న్యాయం చేయాలంటే జనగణనలో కులగణనను తప్పనిసరిగా చేర్చాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కులగణన చేపట్టాలా? వద్దా? అనే విషయంలో బీజేపీ సభ్యులు సూటిగా తమ వైఖరి చెప్పాలని డిమాండ్ చేశారు.

2





..వివరాలు 4లో

## ఓటర్ల జాబితా సవరణ
## ప్రముఖులకు ఈసీ నోటీసులు!

సమంత.. విజయ్ దేవరకొండ.. లక్ష్మణ్‌కు నోటీసులంటూ సమాచారం

- మహేశ్‌బాబు, రాజమౌళి, వెంకటేశ్ పేర్లూ జాబితాలో
- సైనా.. మిథాలీ.. గోపీచంద్‌కూ నోటీసులంటూ ప్రచారం
- వివరాల్లో వ్యత్యాసాలపై ధ్రువీకరణ ప్రక్రియ
- నోటీసుతో ఓటు హక్కు రద్దయినట్లు కాదన్న అధికారులు

## కొండా సురేఖకు మీనాక్షి ఫోన్!



- కాంగ్రెస్‌లో కీలక పరిణామం
- విభేదాలు పక్కనపెట్టి చురుగ్గా ఉండాలని సూచన
- తాజా రాజకీయ పరిణామాలపై ఇరువురి చర్చ
- అసెంబ్లీకి సురేఖ గైర్హాజరుపై పార్టీలో చర్చ
- అధిష్ఠానం సూచనతోనే ఫోన్ చేసినట్లు సమాచారం

4



## రైతులకు యాంత్రీకరణ పథకం

**నచ్చిన కంపెనీ పనిముట్లు కొనుగోలు చేసే స్వేచ్ఛ!**

**మండలిలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సమాధానం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (సమయం న్యూస్):** రాష్ట్రంలో రైతులు తమ అవసరాలకు అనుగుణంగా తమకు నచ్చిన కంపెనీకి చెందిన వ్యవసాయ పనిముట్లు, యంత్ర పరికరాలను కొనుగోలు చేసుకునే పూర్తి స్వేచ్ఛను కల్పిస్తూ ప్రజా ప్రభుత్వం నూతన యాంత్రీకరణ విధానాన్ని అమలు చేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు స్పష్టం చేశారు. శుక్రవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నలకు మంత్రి సమగ్ర సమాధానమిచ్చారు. గత ప్రభుత్వం కేంద్ర నిధులను వాడుకోకుండా నిలిపివేసిన యాంత్రీకరణ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పునరుద్ధరించిందని, రైతు భద్రత, యంత్రాల నాణ్యత విషయంలో కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థల తనిఖీల అనంతరమే నాణ్యమైన పరికరాలను అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు. యాంత్రీకరణ పథకం అమలు కోసం రూపొందించిన ఎంప్యానెల్‌మెంట్ కమిటీలో అధికారులతో పాటు ఆదర్శ రైతులు, ఎఫ్‌పీఓల ప్రతినిధులను భాగస్వాములను చేశామని, 444 కంపెనీలు దరఖాస్తు చేసుకోగా నిర్దేశిత ప్రమాణాలు పాటించే సంస్థలనే ఎంపిక చేస్తున్నామని మంత్రి వివరించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో పథకం కోసం రూ.71 కోట్లు కేటాయించగా రూ.63.11 కోట్లు ఖర్చు చేసి 15,565 పరికరాలను సరఫరా చేశామని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో రూ.147.91 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులకు 50 శాతం, ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీ అందిస్తూ ఆ సొమ్మును నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోనే జమ చేస్తున్నామని తెలిపారు. దీనికి తోడు రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 3.50 లక్షల ఎకరాల ఆయిల్ పామ్ సాగును మరో 3 ఏళ్లలో 6 లక్షల ఎకరాలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అందుకోసం ప్రపంచస్థాయి విదేశీ యంత్రాలను దిగుమతి చేసుకుని ప్రాసెసింగ్ ఫ్యాక్టరీల వద్దే రైతులకు అందుబాటులో ఉంచేలా చర్యలు చేపడుతున్నామని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

## చెరువుల హద్దులకు రక్షణ కవచం

**మత్స్యకారుల బతుకులకు భరోసా**

**ఎఫ్‌టీఎల్ హద్దుల పరిరక్షణపై రాజీ పడేది లేదు**

**శాసనమండలిలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (సమయం న్యూస్):** చెరువులు, కుంటలు, ఇతర జలవనరుల పరిరక్షణతో పాటు వాటిపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారుల జీవ-నోపాధిని కాపాడటాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య అంశంగా భావిస్తోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శాసనమండలిలో జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చెరువుల పూర్తి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) హద్దులను ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుతామని, ఆక్రమణలను ఏమాత్రం సహించేది లేదని విస్పష్టం చేశారు. జలవనరుల సమర్థ నిర్వహణ, ఆక్రమణల నిరోధానికి ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న తరహాలోనే అన్ని చెరువులకు 'పరిరక్షణ, నిర్వహణ కమిటీల' ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించామని వెల్లడించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 44 వేల చెరువులకు జియో ట్యాగింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశామని చెప్పారు. నల్లగొండ జిల్లాలోని నెల్లికల్ ఎత్తిపోతల పథకాన్ని డిసెంబర్ 2027 నాటికి సంపూర్ణంగా పూర్తి చేసి 24 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. తొలి దశలో జూన్ 2027 నాటికి 7,800 ఎకరాలకు, రెండో దశలో డిసెంబర్ 2027 నాటికి మిగిలిన 16 వేల ఎకరాలకు నీరందిస్తామన్నారు. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు రూ. 25.42 కోట్లు మాత్రమే కేటాయిస్తే, తమ ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 310.68 కోట్లు విడుదల చేసి పనులను వేగవంతం చేసిందని పేర్కొన్నారు. ప్రొఫెసర్ ఎం. కోదండరామ్ సహా పలువురు సభ్యుల సూచనల మేరకు ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా బియ్యం, గోధుమలు, చక్కెరతో పాటు కందిపప్పు, వంటనూనె వంటి మరికొన్ని నిత్యావసర సరుకులను పంపిణీ చేసే ప్రతిపాదనను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని, దీనిపై పడే ఆర్థిక భారాన్ని అధ్యయనం చేస్తున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు.

## పురపాలక పాలనలో ట్రాన్స్‌జెండర్లు..

**కో-ఆప్షన్ సభ్యులుగా వారికి అవకాశం**

**అసెంబ్లీలో కీలక బిల్లుకు ఆమోదం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (సమయం న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం మరో చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లకు కో-ఆప్షన్ సభ్యులుగా ప్రాతినిధ్యం కల్పించే బిల్లుకు శాసనసభ శుక్రవారం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో పురపాలక పరిపాలనలో, విధాన నిర్ణయాల్లో ట్రాన్స్‌జెండర్ల భాగస్వామ్యానికి మార్గం సుగమమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరఫున రాష్ట్ర శాసనసభా వ్యవహారాల మంత్రి డి. శ్రీధర్ బాబు 'తెలంగాణ మున్సిపాలిటీల (నాలుగో సవరణ) బిల్లు, 2026'ను సభలో ప్రవేశపెట్టారు. 2019 నాటి తెలంగాణ మున్సిపాలిటీల చట్టానికి ఈ బిల్లు సవరణలు ప్రతిపాదిస్తుంది. దీని ప్రకారం, హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) వెలుపల ఉన్న తొమ్మిది మున్సిపల్ కార్పొరేషన్లలో ఒక్కో ట్రాన్స్‌జెండర్‌ను నామినేటెడ్ సభ్యునిగా కో-ఆప్ట్ చేసుకునే అవకాశం కలుగుతుంది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, సామాజిక వివక్ష, వెలికి గురవుతున్న ట్రాన్స్‌జెండర్లను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడంతో పాటు, ప్రజా జీవితంలో వారి భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగానే ఈ సంస్కరణలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ బిల్లుకు బీజేపీ, సీపీఐ సహా ఇతర పక్షాల సభ్యులు మద్దతు ప్రకటించగా, అనంతరం సభ దీనిని ఏకగ్రీవంగా ఆమోదించింది.

# చదువే తలరాతను మారుస్తుంది

మొదటి పేజీ తరువాయి

పునర్నిర్మాణానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. 2024లో నిర్వహించిన సీపెక్ సర్వేలో చదువు లేకపోవడమే సామాజిక వెనుకబాటుతనానికి ప్రధాన కారణంగా గుర్తించినట్లు తెలిపారు. ఆస్తులు ఉన్నప్పటికీ విద్యకు దూరమైన కొన్ని సామాజిక వర్గాలు వెనుకబడిపోయాయని చెప్పారు. గతంలో గొర్రెలు, మేకల పెంపకం వంటి సంప్రదాయ వృత్తులకే పరిమితమైన కొన్ని వర్గాలు చదువుకు దూరమయ్యాయని పేర్కొన్నారు. పేదలు, దళిత వర్గాలు ఉన్నత స్థాయికి చేరుకోవడంలో విద్యే ప్రధాన కారణమని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చూపిన మార్గాన్ని ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. ప్రపంచంలో ఆర్థిక సరళీకరణ సంస్కరణల తర్వాత విద్యా వ్యవస్థలో భారీ మార్పులు వచ్చాయని సీఎం చెప్పారు. ప్రపంచ విద్యా విధానం ఇప్పుడు మనకు అందుబాటులో ఉందని, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా తెలంగాణ విద్యా వ్యవస్థను సమూలంగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో ఎన్నో ప్రతిష్టాత్మక విద్యాసంస్థలకు పునాదులు వేసిన పండిత్ నెహ్రూ అడుగుజాడల్లో నడుస్తూ.. ప్రస్తుత జెన్ జీతోపాటు జెన్ ఆల్ఫా, జెన్ బీటా తరాల భవిష్యత్తును తరగతి గదుల్లోనే తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వ హయాంలో విద్యతోపాటు సాగునీటి రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. విద్యా వ్యవస్థలో లోటుపాట్లను సరిదిద్దేందుకు ఉమ్మడి రాష్ట్రంలో కూడా లేని విధంగా ప్రత్యేక విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా తెలంగాణలో నూతన మార్గదర్శకాలు రూపొందించేందుకు కేశవరావు కమిటీని నియమించినట్లు చెప్పారు. విద్యారంగంలో ఆధునిక విధానాలను తీసుకొచ్చేందుకు కమిషన్ సభ్యులు అందించే సూచనలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. అన్ని వర్గాల అభిప్రాయాలు స్వీకరించి దేశానికే ఆదర్శంగా నిలిచే అత్యుత్తమ విద్యా విధానాన్ని రూపొందించడమే లక్ష్యమని ప్రకటించారు. రాష్ట్రంలో మొత్తం 28,163 ప్రభుత్వ విద్యాసంస్థల్లో 28.77 లక్షల మంది విద్యార్థులు చదువుతుండగా, 1.57 లక్షల మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని వివరించారు. ఇందులో 24,966 ప్రభుత్వ పాఠశాలల్లో 19,79,614 మంది విద్యార్థులు చదువుతుండగా, 1,24,456 మంది ఉపాధ్యాయులు ఉన్నారని చెప్పారు. రాష్ట్రంలో 444 ప్రభుత్వ ఇంటర్మీడియట్



కళాశాలలు ఉండగా వాటిలో సుమారు 1.95 లక్షల మంది విద్యార్థులు, 6,359 మంది లెక్చరర్లు ఉన్నట్లు తెలిపారు.

**30 మందికి ఒక టీచర్.. మన దగ్గర 17 మందికే ఒకరు**

విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి 30 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండాల్సి ఉండగా తెలంగాణలో ప్రతి 17 మంది విద్యార్థులకే ఒక ఉపాధ్యాయుడు అందుబాటులో ఉన్నారని సీఎం వివరించారు. గత ప్రభుత్వం పదేళ్లలో 7,857 మంది ఉపాధ్యాయులను మాత్రమే నియమించిందని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది వ్యవధిలోనే 11 వేల టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. ఎలాంటి అవినీతి, చిన్న విమర్శకు కూడా తావులేకుండా కేవలం 55 రోజుల్లోనే 10,600 మంది ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందించినట్లు తెలిపారు. ప్రతి గూడెంలో సింగిల్ టీచర్ స్కూల్ ఏర్పడిన పరిస్థితి ఉందని పేర్కొన్న సీఎం.. ప్రతి మూడు కిలోమీటర్ల పరిధిలో ఒక ప్రాథమిక పాఠశాల ఉండేలా విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యతోపాటు విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించడంపైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని చెప్పారు. విద్యాశాఖకు బడ్జెట్ కేటాయింపులను ప్రభుత్వం క్రమంగా పెంచుతోందని రేవంత్‌రెడ్డి తెలిపారు. 2023-24 రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 6.53 శాతం కేటాయించగా, 2024--25లో 7 శాతానికి పైగా, 2025-26లో 8 శాతానికి పైగా ఖర్చు చేసినట్లు చెప్పారు. 2025-26లో విద్యకు రూ.23,729 కోట్లు, 2026-27లో రూ.27,663 కోట్లు కేటాయించినట్లు వివరించారు. భవిష్యత్తులో రాష్ట్ర బడ్జెట్‌లో విద్యాశాఖకు 15 శాతం నిధులు కేటాయించడమే తన లక్ష్యమని ప్రకటించారు.గత మూడేళ్లలో విద్యాశాఖ కోసం రూ.7,554 కోట్లు అదనంగా ఖర్చు చేసినట్లు చెప్పారు. 2023-24లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యకు రూ.18,955 కోట్లు కేటాయించగా, తమ ప్రభుత్వం 2025-26లో రూ.23,729 కోట్లు, 2026-27లో రూ.27,663 కోట్లు కేటాయించిందని వివరించారు.

**'మంత్రి లేరంటున్నారు.. నేనే పర్యవేక్షిస్తున్నా'**

విద్యాశాఖపై తాను సమీక్ష నిర్వహిస్తే 'విద్యాశాఖ మంత్రి సమీక్ష' అని కాకుండా 'సీఎం సమీక్ష' అని అంటున్నారని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పూర్తిస్థాయి విద్యాశాఖ మంత్రి లేరని కొందరు విమర్శిస్తున్నారని, కానీ ముఖ్యమంత్రిగా తానే విద్యాశాఖను పర్యవేక్షిస్తున్న విషయాన్ని గుర్తించాలని అన్నారు. "విద్యాశాఖపై నాకున్న ఆసక్తితోనే దానిని నా దగ్గర ఉంచుకున్నా. పేదలకు మేలు జరగాలన్నదే నా ఉద్దేశం" అని స్పష్టం చేశారు. వైఎస్సార్ హయాంలో ప్రతి జిల్లాకు ఒక విశ్వవిద్యాలయం తీసుకొచ్చిన విషయాన్ని సీఎం ప్రస్తావించారు. విద్యారంగంలో చేపట్టాల్సిన మరిన్ని సంస్కరణలపై నిర్వహించిన సర్వే ద్వారా కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయని చెప్పారు. అసెంబ్లీలో సభ్యులు ఇచ్చిన విలువైన సూచనలపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. విద్యను మరింత ఆధునికంగా, నాణ్యంగా తీర్చిదిద్ది ప్రపంచస్థాయిలో తెలంగాణ విద్యార్థులు పోటీపడేలా చర్యలు తీసుకుంటామని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# కులగణన ఒక 'ఎక్స్‌రే'!

**తెలంగాణ సర్వే దేశానికే ఆదర్శం**

**జనగణనలో కులగణన తప్పనిసరి చేయాలి**

**బీజేపీ వైఖరి సూటిగా చెప్పాలి**

**బలహీన వర్గాలకు న్యాయం కులగణనతోనే**

**దేశ సంపద సమాన పంపిణీకి ఇదే మార్గం**

**అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (సమయం న్యూస్):** దేశంలో సామాజిక అసమానతలను తొలగించి బలహీన వర్గాలకు న్యాయం చేయాలంటే జనగణనలో కులగణనను తప్పనిసరిగా చేర్చాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కులగణన చేపట్టాలా? వద్దా? అనే విషయంలో బీజేపీ సభ్యులు సూటిగా తమ వైఖరి చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ సర్వేను దేశానికి ఆదర్శంగా తీసుకుని దేశవ్యాప్తంగా సమగ్ర సర్వే చేపట్టాలని కోరారు. అసెంబ్లీలో జనగణన, కులగణన అంశంపై జరిగిన చర్చలో భట్టి మాట్లాడుతూ.. కులగణన అనేది ఏదో ఒక కులానికో, రాజకీయ పార్టీకో సంబంధించిన అంశం కాదని, సమాజ శ్రేయస్సుకు సంబంధించిన విషయమని పేర్కొన్నారు. సమాజంలో నెలకొన్న అసమానతలను సరిచేయాలంటే ముందుగా వాటి తీవ్రత, స్వభావాన్ని గుర్తించాలని, అందుకు కులగణన కీలకమన్నారు.

**తెలంగాణ సర్వేలో సమగ్ర సమాచారం**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులపై సమగ్ర సర్వే నిర్వహించిందని భట్టి తెలిపారు. రాష్ట్రంలో ఏ కులానికి ఎంత జనాభా ఉంది? వారి వృత్తులేమిటి? ఆర్థిక పరిస్థితి ఎలా ఉంది? ఎంతమంది చదువుకున్నారు? ఎంతమంది ఉద్యోగాల్లో ఉన్నారు? నిరుద్యోగులు ఎంతమంది? భూమి ఉన్నవారు, లేనివారు ఎంతమంది? వంటి అనేక అంశాలపై కూలంకషంగా సమాచారం సేకరించినట్లు వివరించారు. ప్లానింగ్ శాఖను పర్యవేక్షిస్తున్న ఉప ముఖ్యమంత్రిగా తాను ప్రతిరోజూ ఈ ప్రక్రియను సమీక్షిస్తూ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సర్వే నిర్వహించినట్లు చెప్పారు. తెలంగాణలో చేపట్టిన ఈ సర్వే దేశానికే ఆదర్శంగా నిలిచిందని, నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టినప్పుడు ప్రతిపక్ష సభ్యులు సైతం అభినందించారని గుర్తుచేశారు.

**దేశమంతా తెలంగాణ మోడల్ కావాలి**

తెలంగాణ తరహాలో దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలని కాంగ్రెస్ మొదటి నుంచి డిమాండ్ చేస్తోందని భట్టి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లి పార్లమెంట్‌లోని వివిధ పార్టీల నాయకులతోపాటు ప్రధానమంత్రిని కూడా కలిసి దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని విజ్ఞప్తి చేశారని చెప్పారు. మంత్రులు సైతం కేంద్రంపై ఒత్తిడి తెచ్చారని తెలిపారు. కేంద్రం నుంచి ఆశించిన స్పందన రాకపోవడంతో ఢిల్లీలో అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించి సమావేశం నిర్వహించి తెలంగాణలో అమలు చేసిన విధానాన్ని వివరించినట్లు చెప్పారు. జనగణన సమయంలోనే కులగణనను కూడా చేపడతామని కేంద్రం గతంలో చెప్పిందని, ఇప్పుడు దానిని చేర్చకపోవడం బాధాకరమన్నారు. ఇచ్చిన మాట ప్రకారం జనగణనలో కులగణనను చేర్చాలని డిమాండ్ చేశారు."కులగణన చేద్దామా? వద్దా? అనే విషయాన్ని బీజేపీ సభ్యులు సూటిగా చెప్పాలి. అనుకూలమైతే సభ తరఫున కేంద్ర ప్రభుత్వానికి, ప్రధానమంత్రికి పిలుపునివ్వాలి. వ్యతిరేకమైతే అదే విషయాన్ని స్పష్టంగా చెప్పాలి" అని భట్టి అన్నారు. తెలంగాణలో సర్వే జరిగిన విషయాన్ని అసెంబ్లీలోనే అభినందించి ఇప్పుడు దేశంలో ఎక్కడా కులగణన జరగలేదని చెప్పడం సరికాదన్నారు.

**'అసమానతలను గుర్తించే ఎక్స్‌రే'**

సమాజంలో ఆస్తులు, వనరులు అందరికీ సమానంగా అందడం లేదని భట్టి పేర్కొన్నారు. అసమానతలను తొలగించాలంటే సమస్య ఎక్కడుందో ముందుగా గుర్తించాల్సిందేనన్నారు. "సమాజం ఆరోగ్యంగా లేకపోతే ముందుగా ఎక్స్‌రే తీయాలి. వ్యాధిని నిర్ధారించాలి. ఆ



తర్వాతే చికిత్స చేయాలి. సమాజంలో ఉన్న అసమానతలను గుర్తించే ఎక్స్‌రేనే కులగణన" అని అభివర్ణించారు. కులగణన ద్వారా వివిధ సామాజిక వర్గాల వాస్తవ జనాభాతోపాటు వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులు స్పష్టంగా తెలుస్తాయని చెప్పారు. ఆ సమాచారం ఆధారంగా సంక్షేమ, అభివృద్ధి విధానాలను రూపొందించవచ్చన్నారు. జనాభా ప్రాతిపదికన అవకాశాలు, వనరులు, అభివృద్ధి ఫలాలు అందరికీ సమానంగా చేరేలా చర్యలు తీసుకునేందుకు కులగణన ఉపయోగపడుతుందని వివరించారు.

**'రాహుల్ ప్రధాని అవుతారు'**

రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. రాహుల్ నాయకత్వంలో తెలంగాణలో నిర్వహించిన తరహాలోనే దేశవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ సర్వే నిర్వహిస్తామని ప్రకటించారు. ఆ సర్వే ద్వారా దేశంలోని వివిధ సామాజిక వర్గాల వాస్తవ పరిస్థితులను గుర్తించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. జనాభా ప్రాతిపదికన దేశ అభివృద్ధికి అవసరమైన నిధులు, వనరులు, అవకాశాలు, ఆస్తులు అందరికీ న్యాయంగా, సమానంగా చేరేలా విధానాలను అమలు చేస్తామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# బీసీల జనాభా లెక్కలు తేల్చాలి

**కులగణన చేపట్టాలి: కేంద్రానికి మంత్రి వాకిటి శ్రీహరి డిమాండ్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (సమయం న్యూస్):** దేశవ్యాప్తంగా బిసిల జనాభా, సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితులపై స్పష్టమైన గణాంకాలు అందుబాటులోకి రావాలంటే కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో బీసీల కులగణనను తప్పనిసరిగా చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు ఒ క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి డిమాండ్ చేశారు. శుక్రవారం శాసనసభలో కులగణనపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. బీసీలకు రిజర్వేషన్లు ఎవరో ఇచ్చిన దానం కాదని, దశాబ్దాల పోరాట ఫలితమని స్పష్టం చేశారు. 1953



కాకా కాలేల్కర్ కమిషన్, 1979 బి.పి. మండల్ కమిషన్ రికార్డులు, 1990 ఓబీసీ 27 శాతం రిజర్వేషన్లు, 1992 ఇంద్రా సాహ్నీ కేసు మార్గదర్శకాలు, 2018 నాటి 102వ రాజ్యాంగ సవరణల ప్రస్తావన తెస్తూ జస్టిస్ రోహిణి కమిషన్ తరహాలోనే సరైన డేటా లభించాలంటే కులగణన అత్యంత కీలకమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుల సర్వే సామాజిక న్యాయానికి పునాది అని, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన "జిత్నీ ఆబాదీ.. ఉత్నా హక్" నినాద స్ఫూర్తితోనే ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని వెల్లడించారు. అనంతరం శాసనసభలో సభ్యులు పట్లోళ్ల సంజీవరెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, గండ్ర సత్యనారాయణ రావు, వీర్లపల్లి శంకరయ్యలు అడిగిన ప్రశ్నలకు పశు సంవర్ధక శాఖ మంత్రిగా వాకిటి శ్రీహరి సమాధానమిచ్చారు. రాష్ట్రంలో పాల ఉత్పత్తి 2024-25లో 59.35 లక్షల టన్నులు, 2025-26లో 61.75 లక్షల టన్నులకు పెరిగిందని, 2026-27 తొలి ఆరు నెలల్లో 30 లక్షల టన్నుల ఉత్పత్తి అంచనా ఉందన్నారు. పాడి రైతులకు మద్దతుగా 2026 ఆగస్టు 16 నుంచి గేదె పాలకు ప్రతి కిలో వెన్నకు రూ.914, ఆవు పాలకు రూ.340 ధర ఖరారు చేశామని తెలిపారు. మధిర, కొడంగల్ నియోజకవర్గాల్లో సెర్ప్ (రాజు-రా) భాగస్వామ్యంతో పాడి గేదెల పంపిణీ చేపడుతున్నామని చెప్పారు. గోపాలమిత్రలకు మెడిక్లెయిమ్, ప్రమాద బీమా, సకాలంలో గౌరవ వేతనం అందిస్తున్నామని, పశుసంవర్ధక శాఖలో 1100 మందికి పైగా ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించామని వివరించారు. కర్ణాటక 'నందిని డెయిరీ' కంటే తెలంగాణలోని 'విజయ డెయిరీ' ద్వారా పాడి రైతులకు ఎక్కువ ధర చెల్లిస్తూ విజయాన్ని సాధిస్తున్నామని స్పష్టం చేశారు.

# ‘తమ్ముడు.. లెట్స్ దూ కుమ్ముడు’!

- రేవంత్-పొంగులేటి కలిసి రాష్ట్రాన్ని దోచేస్తున్నారన్న కేటీఆర్
- భూ దందాలు.. కబ్జాలు పరాకాష్టకు చేరాయని ఆరోపణ
- తెరవెనుక సమాంతర రెవెన్యూ సామ్రాజ్యం నడుస్తోందని విమర్శ
- ‘భూభారతి’ పేరుతో ప్రజల భూములకు ‘భూ హారతి’ అన్న హరీశ్
- పొంగులేటి మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్



**హైదరాబాద్, సెప్టెంబర్ 11:** “తమ్ముడు.. లెట్స్ దూ కుమ్ముడు” అన్న రీతిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెట్టాపట్టాలేసుకుని రాష్ట్రాన్ని దోచేస్తున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. రేవంత్ అధికారంలోకి వచ్చిన తర్వాత భూ దందాలు, ల్యాండ్ కబ్జాలు పరాకాష్టకు చేరాయని, అస్మదీయులకు దోచిపెట్టడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. మరోవైపు 22ఏ జాబితా పేరుతో సామాన్యుల భూములను ఇబ్బందుల్లోకి నెట్టారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపిస్తూ.. నైతిక బాధ్యత వహించి మంత్రి పొంగులేటి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో 22ఏ భూ బాధితులతో జరిగిన సమావేశంలో కేటీఆర్, హరీశ్‌రావు మాట్లాడారు. ఈ సందర్భంగా కేటీఆర్.. “కొండల్, తొండల్, అనకొండల్” అంటూ రేవంత్‌రెడ్డి సోదరుడు అనుముల కొండల్‌రెడ్డి, పొంగులేటి వర్గీయులను ఉద్దేశించి విమర్శలు చేశారు. రాష్ట్రంలో అధికారికంగా ఒక రెవెన్యూ వ్యవస్థ ఉంటే.. తెరవెనుక అదృశ్య శక్తులతో మరో సమాంతర రెవెన్యూ సామ్రాజ్యం నడుస్తోందని ఆరోపించారు. ఫైళ్లు ఎవరి ఆదేశాలతో కదులుతున్నాయో, అసైన్డ్ భూములు ఎవరి జేబుల్లోకి వెళ్తున్నాయో అర్థంకాని పరిస్థితి ఏర్పడిందన్నారు.

### ‘10 వేల ఎకరాలపై కన్నేశారు’

లగచర్లలో తమ అల్లుడికి భూములు కట్టబెట్టేందుకు గిరిజనుల పొలాలను గుంజుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. హైదరాబాద్ చుట్టుపక్కల వేల కోట్ల రూపాయల విలువైన 10 వేల ఎకరాల భూములపై సీఎం రేవంత్‌రెడ్డి కన్నేశారని విమర్శించారు. మూసీ ముసుగులో, ఫ్యూచర్ సిటీ పేరుతో పెద్దఎత్తున రియల్ ఎస్టేట్ దందాకు తెరలేపారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో కొంగరకలాన్‌కు ఫాక్స్‌కాన్ వంటి దిగ్గజ కంపెనీని తీసుకొచ్చి ఆ ప్రాంత రూపురేఖలు మార్చితే.. ప్రస్తుతం రూ.200 కోట్ల విలువైన భూమిని రేవంత్ సోదరుడికి చెందిన కంపెనీకి కేవలం రూ.7 కోట్లకే “అడ్డికి పావుశేరు” లెక్కన కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపించారు. రూ.1,000 కోట్ల మాయాజాలానికి తెరతీసి కొంగరకలాన్ భూములను కాజేసే కుట్ర జరుగుతోందన్నారు. భూములు ఇచ్చేందుకు నిరాకరించిన సామాన్యుల స్థలాలను ఉద్దేశపూర్వకంగానే నిషేధిత 22ఏ జాబితాలో పెట్టి వేధిస్తున్నారని మండిపడ్డారు.

### ‘భూమి కనిపిస్తే బుక్కపెట్టు.. జాగా కనిపిస్తే పాగా వేయ్’

తెలంగాణ ఏర్పడకముందు రియల్ ఎస్టేట్ రంగానికి సరైన భరోసా లేదని, కేసీఆర్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే నీరు, విద్యుత్ సమస్యలను పరిష్కరించి భూముల విలువను ఊహించని స్థాయికి తీసుకెళ్లారని కేటీఆర్ పేర్కొన్నారు. ఒకప్పుడు ఎకరం రూ.5 లక్షలు ఉన్న భూమి కేసీఆర్ హయాంలో రూ.50 లక్షలకు పెరిగిందని, దీంతో ప్రజలు భూమిపై పెట్టుబడులు పెట్టేందుకు ధైర్యంగా ముందుకొచ్చారని చెప్పారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో మాత్రం “భూమి కనిపిస్తే బుక్కపెట్టు.. జాగా కనిపిస్తే పాగా వేయ్” అన్న చందంగా దందాలు సాగుతున్నాయని విమర్శించారు. గాంధీల పేరు చెప్పుకుని రాష్ట్రాన్ని ఏలుతున్న నేతలు గజదొంగల్లా మారారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గతంలో ధరణి పోర్టల్‌లో బయోమెట్రిక్ వేలిముద్ర పడితే తప్ప అంగుళం భూమి కూడా మారేది కాదని, ఇప్పుడు ‘భూభారతి’ పేరుతో భూముల గోల్‌మాల్ యథేచ్ఛగా సాగుతోందని ఆరోపించారు. సెక్షన్ 22ఏ ఆధారంగా ఓ ముఠాను ఏర్పాటు చేసుకుని అమాయక ప్రజల ఆస్తులను గుంజుకుంటున్నారన్న ఆరోపణలపై ప్రభుత్వం తక్షణమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బాధితుల తరపున బీఆర్‌ఎస్ న్యాయపరంగా, ప్రజాక్షేత్రంలోనూ పోరాడుతుందని స్పష్టం చేశారు.

### ‘భూభారతి కాదు.. భూ హారతి’

22ఏ వివాదంపై హరీశ్‌రావు మాట్లాడుతూ.. ప్రజల భూములను నిషేధిత జాబితాలో చేర్చడం కేవలం సాంకేతిక పొరపాటు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం దురుద్దేశంతో చేసిన దుర్మార్గమని ఆరోపించారు. “భూభారతి పేరుతో ప్రజల భూములకు భూ హారతి పడుతున్నారు” అంటూ ఎద్దేవా చేశారు. సీఎం ప్రజాపాలనను పక్కనపెట్టి భూములను కాజేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 వేల ఎకరాల పాలిటెక్నిక్ కళాశాలల భూములపై ప్రభుత్వం కన్నేసిందని ఆరోపించారు. భూ సమస్యల పరిష్కారానికి ఫోన్ చేస్తే చాలంటూ ప్రచారం చేసుకున్నారని, బాధితులు నేరుగా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసినా న్యాయం జరగడం లేదన్నారు.

### ‘పేదల ఇళ్లకే హైడ్రా ప్రతాపమా?’

హైడ్రా పేరుతో పేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తున్న ప్రభుత్వం.. బడాబాబులు నిర్మించిన భారీ అక్రమ కట్టడాల జోలికి మాత్రం వెళ్లడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటికి ఏమాత్రం నైతిక బాధ్యత ఉన్నా తక్షణమే మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనల ప్రకారం ముఖ్యమంత్రి నివాసాన్ని 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించుకున్నారని పేర్కొంటూ.. అదే జాబితాలో చిక్కుకుని నానా ఇబ్బందులు పడుతున్న సామాన్యుల భూములు, ఇళ్లను ఎందుకు తొలగించడం లేదని ప్రశ్నించారు. పేదల ఆస్తులను తక్షణమే 22ఏ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు బీఆర్‌ఎస్ ముందుండి రాజీలేని పోరాటం చేస్తుందని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

# రేవంత్ డైరెక్షన్‌లోనే అంతా జరిగింది

- మహిళా ఎమ్మెల్యేలపై విచక్షణారహితంగా దాడి చేశారు
- తెలంగాణలో దేశంలోనే ఎక్కడాలేని విధంగా కౌరవసభ
- జాతీయ మహిళా కమిషన్‌కు సబితా ఇంద్రారెడ్డి ఫిర్యాదు




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11:** తెలంగాణ అసెంబ్లీ ముట్టడి సందర్భంగా బీఆర్‌ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు విచక్షణారహితంగా దాడి చేశారని ఆరోపిస్తూ మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఢిల్లీ వేదికగా తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆమె జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌తో పాటు జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులకు ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆమె, తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద జరిగిన ఘటనలు దేశంలోనే ఎక్కడాలేని విధంగా కౌరవసభను తలపించాయని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతిపక్షాలకు ఉంటుందని, అయితే 30 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న తమను శాసనసభ లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారని సబితా ఇంద్రారెడ్డి వాపోయారు. కనీసం మహిళా ప్రజాప్రతినిధులనైనా సభలోకి అనుమతించాలని విన్నవించినా పోలీసులు పట్టించుకోలేదని, మహిళా ఎమ్మెల్యేల జుట్టు పట్టుకుని లాగడమే కాకుండా, పురుష ఎమ్మెల్యేలను కిందపడేసి తొక్కేశారని ఆరోపించారు. ఈ తోపులాటలోనే మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి కిందపడిపోయారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యక్ష ఆదేశాలతోనే పోలీసు బలగాలు తమపై ఈ స్థాయిలో విరుచుకుపడ్డాయని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. శాసనసభ లోపలైనా ఈ దాడిపై ప్రభుత్వం చర్చ జరుపుతుందని, సీఎం లేదా హోంమంత్రి బాధ్యత వహించి మాట్లాడతారని భావించామని, కానీ దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకపోగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపైనే ఎదురు కేసులు బనాయించారని సబిత ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎమ్మెల్యేలను లైంగికంగా వేధించారంటూ అసత్య ఫిర్యాదులు చేయించడం, కేసీఆర్ నివాసం వద్దకు నిరసనకారులను పంపడం వంటివన్నీ సీఎం రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లోనే జరిగాయని ఆరోపించారు. రాష్ట్రంలో న్యాయం జరగకపోవడం వల్లే తాము ఢిల్లీకి వచ్చి జాతీయ కమిషన్లను ఆశ్రయించాల్సి వచ్చిందని, ఇది తెలంగాణ ప్రభుత్వానికి సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. వంద రోజుల్లో ఇస్తామన్న హామీలను నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు మహిళా కానిస్టేబుళ్లను అడ్డుపెట్టుకుని ‘శిఖండి రాజకీయాలు’ చేస్తోందని ధ్వజమెత్తారు. 22ఏ పేరుతో కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చి భారీ భూదందాకు తెరలేపారని విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ఈ దాడుల ఘటనలపై సమగ్ర లేఖలు రాస్తున్నామని, కాంగ్రెస్ నాయకత్వం దీనిపై వెంటనే స్పందించి సమాధానం చెప్పాలని సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు.

# బొల్లారం ఆయుధాల చోరీ కేసు..

### ఛేదించిన పోలీసులు, మిలిటరీ అధికారులు
### కేసులో నలుగురు నిందితులను అరెస్ట్

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (సమయం న్యూస్):** హైదరాబాద్‌లోని బొల్లారంలో ఉన్న మద్రాస్ రెజిమెంట్ బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లో జరిగిన భారీ ఆయుధాల చోరీ కేసును పోలీసులు, మిలిటరీ అధికారులు అత్యంత సమర్థవంతంగా ఛేదించారు. ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలను తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి మొత్తం నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. చోరీకి గురైన అత్యంత ప్రమాదకరమైన ఆయుధాలు, మ్యాగజైన్లు, బుల్లెట్లు, బైనాక్యులర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు స్పష్టం చేశారు. ఆగస్టు 31న జరిగిన ఈ ఆయుధాల దొంగతనంలో బెల్ ఆఫ్ ఆర్మ్స్ ఇన్ ఛార్జ్, అమ్యునేషన్ సెక్షన్ ఇన్ ఛార్జ్ సహకారం ఉన్నట్లు విచారణలో తేలింది. మొదట బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లోకి ప్రత్యక్షంగా ప్రవేశ అర్హత ఉన్న 16 మందిపై దృష్టి సారించిన అధికారులు, సుదీర్ఘ సాంకేతిక విచారణ చేపట్టారు. ఈ క్రమంలో హవాల్దార్లు టి.పి.ఎస్. రావు, మల్లేశ్ అలియాస్ రాజుల ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో వారిపై నిఘా పెట్టారు. విచారణ సమయంలో మల్లేశ్ అధికారులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసినప్పటికీ, సాంకేతిక ఆధారాలతో నిలదీయడం, అధికారులు అతడి భార్యకు పరిస్థితి వివరించడంతో అసలు నిజం బయటపడింది. భార్య గట్టిగా ప్రశ్నించడంతో మల్లేశ్ ఆయుధాల దొంగతనం ఒప్పుకున్నాడు. దర్యాప్తు వివరాల ప్రకారం.. నిందితుడు మల్లేశ్ ఆగస్టు 28, 29 తేదీల్లో ఆయుధాగారం వద్ద రెక్కీ నిర్వహించి, రాత్రి వేళల్లో సీసీ కెమెరాలు లేని మార్గాలను గుర్తించాడు. ఆగస్టు 30న కార్గిల్ గేట్ నుంచి లోపలికి వచ్చి పరిస్థితులను గమనించి, 31వ తేదీన పక్కా ప్రణాళికతో ఆయుధాలను చోరీ చేశాడు. ఆర్మీ నుంచి తనను అకారణంగా తొలగించారన్న కోపంతోనే మల్లేశ్ ఈ చర్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఆయుధాలను చోరీ చేశాక మొదట ఒక చోట పాతిపెట్టి, ఆ తర్వాత మరో ప్రాంతానికి ఎందుకు మార్చాడనే కోణంలో లోతైన విచారణ సాగుతోందని డీజీపీ వివరించారు. ఈ చోరీకి ఎలాంటి అంతర్జాతీయ ముఠాలతో గానీ, ఉగ్రవాద సంస్థలతో గానీ సంబంధాలు ఉన్నట్లు ఇప్పటివరకు ఆధారాలు లభించలేదని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. దేశ అంతర్గత భద్రతకు తీవ్ర ముప్పుగా పరిణమించే అవకాశం ఉన్న ఈ ప్రమాదకర ఆయుధాల చోరీని సత్వరమే ఛేదించిన మిలిటరీ అధికారులను, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్‌ను, దర్యాప్తు





బృందాలను డీజీపీ సీవీ ఆనంద్ ప్రత్యేకంగా ప్రశంసించారు.



# కొండా సురేఖకు మీనాక్షి నటరాజన్ ఫోన్!

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (సమయం న్యూస్):** తెలంగాణ కాంగ్రెస్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ మాజీ మంత్రి కొండా సురేఖకు స్వయంగా ఫోన్ చేసినట్లు పార్టీ వర్గాల ద్వారా సమాచారం. రాష్ట్ర శాసనసభ సమావేశాలు కొనసాగుతున్న సమయంలో ఇన్‌ఛార్జ్ నేరుగా సురేఖతో మాట్లాడటం రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ఫోన్ సంభాషణ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిస్థితులతోపాటు కాంగ్రెస్‌లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలపై ఇరువురి మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. గతంలో తలెత్తిన కొన్ని వ్యక్తిగత అంశాలు, అంతర్గత విభేదాలను పక్కనపెట్టి పార్టీ కార్యక్రమాల్లో తిరిగి ఉత్సాహంగా, చురుగ్గా పాల్గొనాలని మీనాక్షి నటరాజన్ సూచించినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిఫార్సు మేరకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత జరుగుతున్న ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలకు సురేఖ హాజరుకాకపోవడం కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలోనే పార్టీ అధిష్ఠానం సూచనల మేరకు మీనాక్షి నటరాజన్ స్వయంగా రంగంలోకి దిగి కొండా సురేఖతో మాట్లాడినట్లు సమాచారం. విభేదాలను పక్కనపెట్టి పార్టీ కార్యక్రమాల్లో మళ్లీ క్రియాశీలంగా వ్యవహరించాలని సూచించినట్లు తెలుస్తోంది. దీంతో రానున్న రోజుల్లో కొండా సురేఖ రాజకీయంగా ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.

# మూసీ ప్రాజెక్టుకు ‘గ్రీన్’ అడ్డంకులు!

### రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్జీటీ నోటీసులు
### పర్యావరణ అనుమతులను సవాల్ చేసిన రిటైర్డ్ ఇంజినీర్లు
### 55 కిలోమీటర్లకు 20 కిలోమీటర్లే అధ్యయనమంటూ అభ్యంతరం
### ఉస్మాన్‌సాగర్.. హిమాయత్‌సాగర్ నిర్మాణాలపైనా ప్రశ్నలు
### తదుపరి విచారణ అక్టోబర్ 16కు వాయిదా

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (సమయం న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు మరోసారి న్యాయపరమైన అడ్డంకులు ఎదురయ్యాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పర్యావరణ అనుమతులను సవాల్ చేస్తూ కొందరు రిటైర్డ్ ఇంజినీర్లు చెన్నైలోని ‘నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్’ (ఎన్జీటీ) దక్షిణాది బెంచ్‌ను ఆశ్రయించారు. ఈ అప్పీల్‌పై విచారణ జరిపిన ట్రిబ్యునల్, ప్రతివాదిగా ఉన్న తెలంగాణ ప్రభుత్వానికి అధికారికంగా నోటీసులు జారీ చేసింది. మూసీ ప్రక్షాళన పనులకు సంబంధించిన పర్యావరణ నిబంధనలు మరియు అనుమతుల్లో స్పష్టమైన లోపాలు ఉన్నాయని పిటిషనర్లు తమ పిటిషన్‌లో ఆరోపించారు. మూసీ పరివాహక ప్రాంతం మొత్తం 55 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంటే, కేవలం 20 కిలోమీటర్ల పరిధిలో మాత్రమే అధ్యయనం చేయడం సరికాదని పేర్కొన్నారు. అంతేకాకుండా, ఇదే ప్రాంతంలో ప్రముఖ ‘మృగవాణి జాతీయ పార్కు’ కూడా ఉన్న విషయాన్ని వారు ట్రిబ్యునల్ దృష్టికి తీసుకువచ్చారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాల పరిసర ప్రాంతాల్లో భారీ నిర్మాణాలు చేపట్టాలన్న ప్రభుత్వ నిర్ణయంపై రిటైర్డ్ ఇంజినీర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ ప్రాంతంలో వాణిజ్య సముదాయాల ఏర్పాటు నిర్ణయం పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తుందని వాదించారు. ఈ ప్రాజెక్టు వల్ల భవిష్యత్తులో పర్యావరణంపై పడే దుష్ప్రభావాలను సమగ్రంగా విశ్లేషించాల్సిన అవసరం ఉందని పిటిషనర్లు స్పష్టం చేశారు. పిటిషన్‌ను పరిశీలించిన ఎన్జీటీ.. పర్యావరణ అనుమతుల జారీ, ప్రాజెక్టు అమలుకు సంబంధించిన పూర్తి వివరాలను తమ ముందుంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. మూసీ ప్రాజెక్టుపై గతంలోనూ కొద్దికాలం క్రితం న్యాయపరమైన వివాదాలు నడిచినా, ఇప్పుడు తాజా పిటిషన్ దాఖలు కావడంతో ఈ వ్యవహారం రాజకీయంగా కూడా తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ అప్పీల్‌పై తదుపరి విచారణను ఎన్జీటీ అక్టోబర్ 16వ తేదీకి వాయిదా వేసింది.

# మోదీ 25 ఏళ్ల ప్రజా సేవ

### సెప్టెంబర్ 17 నుంచి ‘సేవా సంకల్ప్ అభియాన్’
### 17న ప్రతి ఇంటా ‘ఆశీర్వాద్ కా దియా’ పేరిట దీపాల వెలుగులు



**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (సమయం న్యూస్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటున్న సందర్భంగా తెలంగాణ వ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు ‘సేవా సంకల్ప్ అభియాన్’ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. వి. రాంచందర్ రావు వెల్లడించారు. పార్టీ శ్రేణుల్లో సేవా భావాన్ని నింపడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత దగ్గర చేయడమే ఈ నెల రోజుల ప్రచార కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. అభియాన్ ప్రారంభ రోజైన సెప్టెంబర్ 17న ‘ఆశీర్వాద్ కా దియా’ పేరిట ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించి ప్రధానమంత్రికి శుభాకాంక్షలు తెలుపాలని ప్రజలకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ నెల రోజుల వ్యవధిలో రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య పరీక్షలు, ‘స్వచ్ఛ భారత్’ పారిశుధ్య డ్రైవ్‌లతో పాటు పాఠశాలలు, కళాశాలల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జన్‌ధన్ యోజన, డీబీటీ, పీఎం విశ్వకర్మ, పీఎం స్వనిధి, ముద్ర రుణాల వంటి చారిత్రాత్మక పథకాలతో పేదలు, చేతివృత్తిదారులకు కలిగిన లబ్ధిని ప్రజలకు వివరిస్తామన్నారు. ఈ క్రమంలో ‘మేరే సప్నో కా భారత్’, ‘సేవా కీ కహానీ’, ‘సేవా జ్యోతి కలశ్ యాత్ర’, ‘సుశాసన సేవా సంవాద్’ వంటి సామాజిక-సంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రధాని మోదీ సుపరిపాలన సందేశాన్ని ప్రతి ఇంటికీ చేరవేస్తామని రాంచందర్ రావు స్పష్టం చేశారు.

## సంపాదకీయం



# మొహం చాటేసిన వర్షాలు

## రైతన్న గుండెల్లో గుబులు!

### వానాకాలం ముగుస్తున్నా తీరని వర్షాభావం

**వానాకాలం ముగింపు దశకు చేరుతున్నా వరుణుడు కరుణించడం లేదు. అక్కడక్కడ చెదురుమదురు వర్షాలు మినహా ఆశించిన స్థాయిలో వానలు లేక రైతుల్లో ఆందోళన పెరుగుతోంది. సెప్టెంబర్ మూడో వారం నుంచి దేశవ్యాప్తంగా పొడి వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్నాయన్న అంచనాలు, పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న 'ఎల్‌నినో' ప్రభావం రబీ పంటల భవిష్యత్తుపై మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, బీహార్ సహా పలు రాష్ట్రాల్లో సాధారణం కంటే 27 నుంచి 45 శాతం వరకు తక్కువ వర్షపాతం నమోదైనట్లు వివరాలు చెబుతున్నాయి. దేశంలోని 178 ప్రధాన రిజర్వాయర్లలో నీటి నిల్వలు గతేడాదితో పోలిస్తే దాదాపు 20 శాతం తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నాయి. గతేడాది ఇదే సమయంలో 163.44 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు ఉండగా ప్రస్తుతం 130.55 బిలియన్ క్యూబిక్ మీటర్లకు పరిమితమైనట్లు సమాచారం. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి వ్యవసాయ ఆధారిత రాష్ట్రాల్లో నీటి కొరత రబీ సాగుపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అక్టోబర్ నుంచి ప్రారంభమయ్యే రబీ సీజన్‌లో నేలలో తేమ అత్యంత కీలకం. ముఖ్యంగా గోధుమ, ఆవాలు, శనగ పంటలకు నీటి లభ్యత, భూమిలో తేమ అవసరం. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హర్యానాలో గోధుమలు, ఆవాల సాగుకు తొలి తడికి రిజర్వాయర్ల నీరే ప్రధాన ఆధారం. మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్‌లోని నల్లరేగడి నేలల్లో శనగ పంట ఎక్కువగా భూమిలోని తేమపైనే ఆధారపడుతుంది. వర్షాలు లేక భూమి ఎండిపోతే దిగుబడులు తగ్గే ప్రమాదం ఉంది.**

ఎల్‌నినో వల్ల ఏర్పడే ప్రతికూల పరిస్థితులను 'ఇండియన్ ఓషన్ డైపోల్' కొంతవరకు తగ్గించవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. హిందూ మహాసముద్రంలో ఏర్పడే సానుకూల మార్పులతో భారత్ వైపు వర్షపు మేఘాలు వచ్చే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. 1997, 2023 సంవత్సరాల్లో ఎల్‌నినో తీవ్రతను ఈ ప్రభావం కొంతవరకు తగ్గించినట్లు పేర్కొంటున్నారు. అయితే ఇది ప్రధానంగా వర్షాకాలానికే పరిమితమయ్యే అవకాశం ఉండటంతో ఇప్పటికే తగ్గిపోయిన భూగర్భ జలాలు, రిజర్వాయర్లను ఎంతవరకు నింపగలదన్న సందేహాలున్నాయి. అక్టోబర్, నవంబర్‌లోనూ భూమిలో తేమ పెరగకపోతే రబీ సాగు విస్తీర్ణంతోపాటు దిగుబడులు తగ్గే ప్రమాదం ఉంది. ఫలితంగా గోధుమలు, పప్పుధాన్యాలు, వంటనూనెల సరఫరాపై ప్రభావం పడి నిత్యావసర ధరలు పెరిగే అవకాశం ఉందని ఆర్థిక విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. రాష్ట్రంలోనూ వర్షాభావ పరిస్థితులు రైతులను కలవరపెడుతున్నాయి. వర్షాధార పంటల సాగు తగ్గగా, బోర్లు, బావులపై ఆధారపడి సాగు చేసిన వరిని కాపాడుకునేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు. భూగర్భ జలాలు పడిపోవడంతో బోర్లు వట్టిపోతున్నాయి. పంటలు ఎండిపోతుండటంతో బావుల్లో పూడిక తీయించడం, కొత్త బోర్లు వేయించడం చేస్తున్నా కొన్నిచోట్ల నీరు లభించడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. మరో వారం, పదిరోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగితే పంటలపై ఆశలు వదులుకోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో సాధారణంగా 1.32 కోట్ల ఎకరాల్లో సాగు నమోదవుతుండగా ఈ ఏడాది 1.21 కోట్ల ఎకరాలు, అంటే సుమారు 92 శాతానికే పరిమితమైనట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. సాధారణంగా 66 లక్షల ఎకరాల్లో నమోదయ్యే వరి సాగు ఈసారి 52.81 లక్షల ఎకరాలు, అంటే 80 శాతానికే పరిమితమైంది. అధికంగా నీటిపై ఆధారపడే వరి సాగు దాదాపు 20 శాతం తగ్గింది. మరోవైపు 47 లక్షల ఎకరాల అంచనాకు గాను పత్తి 48 లక్షల ఎకరాల్లో సాగైంది. అపరాల సాగు 6.49 లక్షల ఎకరాల అంచనాను దాటి 7.86 లక్షల ఎకరాలకు చేరింది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు రాష్ట్రంలో 49 రోజులే వర్షం కురిసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. 598.9 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికి గాను 478.2 మిల్లీమీటర్లే నమోదై మొత్తంగా 20 శాతం లోటు ఏర్పడింది. 15 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా మిగిలిన 18 జిల్లాల్లో లోటు కొనసాగుతోంది. జనగామ, వరంగల్, హనుమకొండ, భద్రాద్రి కొత్తగూడెం, జోగులాంబ గద్వాల, సూర్యాపేట, ఖమ్మం, యాదాద్రి భువనగిరి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో దాదాపు 40 శాతం లోటు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. గతేడాదితో పోలిస్తే రాష్ట్రంలో భూగర్భ జలమట్టం 2 మీటర్లకు పైగా పడిపోయింది. గత సంవత్సరం ఆగస్టు చివరినాటికి 5.78 మీటర్ల లోతులో ఉన్న నీటిమట్టం ప్రస్తుతం 7.87 మీటర్లకు పడిపోయినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. సూర్యాపేట, వికారాబాద్ జిల్లాల్లో గతంతో పోలిస్తే అదనంగా 5 మీటర్ల మేర నీటిమట్టం తగ్గగా, నారాయణపేట, మహబూబ్‌నగర్, మేడ్చల్ జిల్లాల్లో 4 మీటర్లు, వరంగల్, సంగారెడ్డి, రంగారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో 3 మీటర్ల మేర మరింత లోతుకు వెళ్లినట్లు సమాచారం. వర్షాలు లేక, సాగునీరు అందక రైతులు చెరువుల్లో మిగిలిన కొద్దిపాటి నీటినీ మోటార్లతో తోడుకుంటున్నారు. వనపర్తి జిల్లా పీపనగండ్ల మండలం పుల్గర్ల గ్రామంలోని కొత్త చెరువు పరిధిలో సాధారణంగా 50 ఎకరాలకు పైగా ఆయకట్టు సాగవుతుండగా, ఈసారి నీటి వసతి ఉన్న కొందరు రైతులు అక్కడక్కడ సుమారు ఐదు ఎకరాల్లో మాత్రమే వరి సాగు చేశారు. మిగిలిన పొలాలు బీళ్లుగా మారాయి. ఆయకట్టు చివరనున్న పంటలకు నీరందించేందుకు చెరువులో మిగిలిన కొద్దిపాటి నీటిని తోడేందుకు రైతులు మోటార్లు ఏర్పాటు చేసుకున్నారు. ఇదే వర్షాభావ పరిస్థితి కొనసాగితే రబీ పంటలకే కాదు.. భూగర్భ జలాలు మరింత దిగజారి వచ్చే రోజుల్లో సాగునీటితోపాటు తాగునీటికీ ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వాన కోసం ఆకాశం వైపు చూస్తున్న అన్నదాతకు ఇప్పుడు ప్రతి రోజూ కీలకంగానే మారుతోంది.

# ప్రపంచం కంటే రెండింతల వేగంతో 'బ్రిక్స్' వృద్ధి!

- ప్రపంచ జీడీపీలో 40 శాతానికి పైగా వాటా
- ప్రపంచ జనాభాలో సగం బ్రిక్స్ దేశాల్లోనే
- ఆవిష్కరణలకు కీలక కేంద్రాలుగా ఎదుగుతున్న సభ్య దేశాలు
- వాణిజ్యం.. పెట్టుబడులు.. సాంకేతిక సహకారం పెరగాలి
- బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్‌లో ప్రధాని మోదీ




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11 (సమయం న్యూస్):** ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ దేశాల ప్రాధాన్యం శరవేగంగా పెరుగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ప్రపంచ ఆర్థిక వృద్ధితో పోలిస్తే బ్రిక్స్ దేశాల ఉమ్మడి ఆర్థిక వ్యవస్థ దాదాపు రెండింతల వేగంతో పురోగమిస్తోందని పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్ నాయకుల సమావేశంలో మోదీ ప్రసంగించారు. ప్రస్తుతం బ్రిక్స్ దేశాలు ప్రపంచ జనాభాలో 50 శాతం, ప్రపంచ జీడీపీలో 40 శాతం, ప్రపంచ వాణిజ్యంలో 25 శాతానికి పైగా వాటాను కలిగి ఉన్నాయని మోదీ తెలిపారు. గత కొన్నేళ్లలో ప్రపంచ జీడీపీ సుమారు రెండున్నర రెట్లు పెరగగా, అదే సమయంలో బ్రిక్స్ దేశాల ఉమ్మడి జీడీపీ దాదాపు నాలుగున్నర రెట్లు విస్తరించిందన్నారు. ప్రపంచంలోని మిగిలిన దేశాలతో పోలిస్తే బ్రిక్స్ ఆర్థిక బలం దాదాపు రెండింతల వేగంతో పురోగమించిందని చెప్పారు. బ్రిక్స్ దేశాలు ప్రపంచస్థాయి ఆవిష్కరణలు, పరిష్కారాలకు కీలక కేంద్రాలుగా ఎదుగుతున్నాయని మోదీ పేర్కొన్నారు. అట్టడుగు స్థాయి ప్రజాప్రయోజన కార్యక్రమాల నుంచి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వరకు విస్తృతంగా కొత్త ఆవిష్కరణలకు అవకాశాలు రూపుదిద్దుకుంటున్నాయని చెప్పారు. సాంకేతికత, ఆవిష్కరణలు, కొత్త ఆలోచనలకు సభ్య దేశాల్లో పెరుగుతున్న ప్రాధాన్యం వాటి భవిష్యత్ సామర్థ్యానికి నిదర్శనమన్నారు. బ్రిక్స్ దేశాల్లో పెరుగుతున్న స్థాయి, వేగం, ఆశావాదం స్పష్టంగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఆర్థిక, వాణిజ్య, సాంకేతిక రంగాల్లో సభ్య దేశాల మధ్య సహకారం మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. భారత్ వేదికగా జరుగుతున్న ఈ సమావేశం ఇప్పటివరకు నిర్వహించిన వాటిలో అతిపెద్ద బిజినెస్ ఫోరమ్ అని చెప్పారు. వివిధ దేశాల వ్యాపార, పారిశ్రామిక వర్గాలు ఒకే వేదికపైకి రావడం కొత్త అవకాశాలకు మార్గం సుగమం చేస్తుందని మోదీ పేర్కొన్నారు.



### మోదీ-పుతిన్ భేటీ.. ద్వైపాక్షిక బంధాలపై సమీక్ష

న్యూఢిల్లీలో భారత అధ్యక్షతన జరుగుతున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సమావేశమయ్యారు. రాజకీయ, ఆర్థిక, రక్షణ, ఇంధనం, అంతరిక్షం, నైపుణ్య చలనశీలత, ప్రజా సంబంధాలు తదితర రంగాల్లో ఇరు దేశాల మధ్య జరుగుతున్న పురోగతిని ఇద్దరు నేతలు సమీక్షించారు. 2026లో భారత్ అధ్యక్షతన జరుగుతున్న బ్రిక్స్‌తోపాటు వివిధ అంతర్జాతీయ, బహుళపక్ష వేదికల్లో భారత్--రష్యా భాగస్వామ్యంపైనా అభిప్రాయాలను పంచుకున్నారు. పశ్చిమాసియా, నల్ల సముద్ర ప్రాంతాల్లో కొనసాగుతున్న ఘర్షణల కారణంగా సముద్ర వర్తకం, భారతీయ నావికుల భద్రతపై పడుతున్న ప్రభావం కూడా చర్చకు వచ్చింది. వివాదాల పరిష్కారానికి దౌత్యం, చర్చలే సరైన మార్గమని మోదీ పునరుద్ఘాటించారు. శాంతి స్థాపన ప్రయత్నాలకు సహకరించేందుకు భారత్ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. భౌగోళిక రాజకీయ అనిశ్చితులు కొనసాగుతున్నప్పటికీ బలంగా నిలిచిన భారత్-రష్యా 'ప్రత్యేక, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని' మరింత బలోపేతం చేసేందుకు నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని ఇరు నేతలు అంగీకరించారు.

### విశ్వసనీయ వ్యాపార బంధాలే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక : పుతిన్

బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్‌లో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మాట్లాడుతూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వస్తున్న మార్పులు, వ్యాపార భాగస్వామ్యాల ప్రాధాన్యాన్ని వివరించారు. పరస్పర నమ్మకంతో కూడిన వ్యాపార సంబంధాలు, ఆర్థిక భాగస్వామ్యాలే అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని పేర్కొన్నారు. ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించడంతోపాటు దేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడంలో ఇవి కీలకమన్నారు. గతంలో ప్రపంచ ఆర్థిక వృద్ధికి నాయకత్వం వహించిన పాత ఆర్థిక శక్తుల స్థానంలోకి కొత్త ఆర్థిక శక్తులు వస్తున్నాయని, ఇది సహజమైన మార్పని పుతిన్ వ్యాఖ్యానించారు. ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ దేశాల వాటా గత ఐదేళ్లలో 40 శాతానికి పైగా ఉండగా, జీ-7 దేశాల వాటా 29 శాతానికే పరిమితమైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తోపాటు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా, భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్, వాణిజ్య మంత్రి పియూష్ గోయల్, ఇతర భాగస్వామ్య దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.




# ఓటర్ల జాబితా సవరణ
# ప్రముఖులకు ఈసీ నోటీసులు!

### సమంత.. విజయ్ దేవరకొండ.. లక్ష్మణ్‌కు నోటీసులంటూ సమాచారం
### మహేశ్‌బాబు, రాజమౌళి, వెంకటేశ్ పేర్లూ జాబితాలో
### సైనా.. మిథాలీ.. గోపీచంద్‌కూ నోటీసులంటూ ప్రచారం
### వివరాల్లో వ్యత్యాసాలపై ధ్రువీకరణ ప్రక్రియ
### నోటీసుతో ఓటు హక్కు రద్దయినట్లు కాదన్న అధికారులు


**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (సమయం న్యూస్):** దేశవ్యాప్తంగా కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన పలువురు సినీ, క్రీడా రంగ ప్రముఖులకు నోటీసులు జారీ అయినట్లు సమాచారం. హీరోయిన్ సమంత, హీరో విజయ్ దేవరకొండ, మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ తదితరులు నోటీసులు అందుకున్నవారి జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. ఓటర్ల జాబితాలో నమోదైన వివరాలను ధ్రువీకరించేందుకే వీటిని జారీ చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. నటుడు మహేశ్‌బాబు, ఆయన భార్య నమ్రత, దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, నటుడు వెంకటేశ్, ఆయన కుమార్తెలు, నటుడు ఆనంద్ దేవరకొండతోపాటు క్రీడాకారులు సైనా నెహ్వాల్, మిథాలీ రాజ్, పుల్లెల గోపీచంద్ పేర్లు కూడా ఈ జాబితాలో ఉన్నట్లు సమాచారం. ఫార్మా దిగ్గజం మురళీకృష్ణ ప్రసాద్ దివి, రామ్‌చరణ్ సతీమణి ఉపాసన కొణిదెలకు కూడా నోటీసులు జారీ అయినట్లు తెలుస్తోంది.

### వివరాల్లో తేడాలతోనే నోటీసులు?

ఓటర్ల పేర్లు లేదా వారి తల్లిదండ్రుల పేర్లలో వ్యత్యాసాలు ఉండటం, పాత రికార్డులతో ప్రస్తుతం నమోదైన వివరాలు సరిపోలకపోవడం వంటి కారణాలతో నోటీసులు పంపినట్లు అధికారులు పేర్కొంటున్నారు. కొన్ని సందర్భాల్లో నోటీసుల్లో నిర్దిష్ట కారణాన్ని పేర్కొనలేదన్న వార్తలు కూడా వస్తున్నాయి. నోటీసులు అందుకున్నవారు నేరుగా హాజరై తమ వివరాలను ధ్రువీకరించుకోవచ్చని, అవసరమైన పత్రాలను సమర్పించి పొరపాట్లు ఉంటే సరిదిద్దుకోవచ్చని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. వ్యక్తిగతంగా హాజరుకాలేని వారు తమ తరఫున ప్రతినిధులను పంపేందుకు కూడా అవకాశం కల్పించినట్లు సమాచారం. అయితే, నోటీసు జారీ అయినంత మాత్రాన ఓటు హక్కు రద్దయినట్లు కాదని, ఇది కేవలం వివరాల ధ్రువీకరణ ప్రక్రియలో భాగమేనని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

### కర్ణాటకలోనూ ప్రముఖులకు..

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ దేశవ్యాప్తంగా కొనసాగుతోంది. కర్ణాటకలో ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని, జెరోధా వ్యవస్థాపకులు నితిన్, నిఖిల్ కామత్‌లకు కూడా ఇటువంటి నోటీసులు అందినట్లు సమాచారం. ఇదే క్రమంలో ప్రముఖ శాస్త్రవేత్త, భారతరత్న సీఎన్ఆర్ రావుకు కూడా నోటీసు జారీ అయిందంటూ వచ్చిన వార్తలను ఎన్నికల సంఘం ఖండించింది.




# టెక్ సపోర్ట్ పేరుతో మోసం
## భారత విద్యార్థికి 30 నెలల జైలు!

### వియత్నాం యుద్ధంలో పాల్గొన్న వృద్ధుడే లక్ష్యం
### లక్ష డాలర్లకు చేరువగా పరిహారం చెల్లించాలని ఆదేశం
### శిక్ష తర్వాత మూడేళ్లు అధికారుల పర్యవేక్షణ
### రెండోసారి డబ్బు తీసుకునేందుకు వెళ్లి చిక్కిన విద్యార్థి
### స్టూడెంట్ వీసాపై టెక్సాస్‌లో ఉంటున్న చాగంరెడ్డి

**వాషింగ్టన్, సెప్టెంబర్ 11 (సమయం న్యూస్):** అమెరికాలో ఉన్నత విద్య కోసం వెళ్లిన భారత విద్యార్థి మోసం కేసులో జైలు పాలయ్యాడు. టెక్ సపోర్ట్ పేరుతో వియత్నాం యుద్ధంలో పాల్గొన్న ఓ వృద్ధుడిని మోసగించిన కేసులో వెంకటేశ్వర చాగంరెడ్డికి అమెరికా కోర్టు 30 నెలల జైలు శిక్ష విధించింది. బాధితుడికి 99,496 డాలర్లు (దాదాపు రూ.83 లక్షలు) పరిహారంగా చెల్లించాలని ఆదేశించింది. జైలు శిక్ష పూర్తయిన తర్వాత మరో మూడేళ్లపాటు అధికారుల పర్యవేక్షణలో ఉండాలని స్పష్టం చేసింది. ఒక్లహోమాలో నివసిస్తున్న వృద్ధుడికి మైక్రోసాఫ్ట్ టెక్నికల్ సపోర్ట్ ప్రతినిధిగా పరిచయం చేసుకున్న ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. బాధితుడి కంప్యూటర్‌లో చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరుగుతున్నాయని, ఈ విషయాన్ని ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామని బెదిరించాడు. దీంతో భయపడిన వృద్ధుడికి తన వద్ద ఉన్న నగదును బంగారంగా మార్చి, ఇంటికి వచ్చే ఫెడరల్ అధికారికి అప్పగించాలని సూచించాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు చెప్పినట్లుగానే చేశాడు. అయితే కొద్దిరోజుల తర్వాత మరోసారి ఫోన్ చేసి మరింత డబ్బు డిమాండ్ చేయడంతో వృద్ధుడికి అనుమానం వచ్చింది. కుటుంబ సభ్యుల సహాయంతో తాను మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు.

### రెండోసారి వెళ్లి చిక్కాడు

రెండో విడత డబ్బు తీసుకునేందుకు బాధితుడి ఇంటికి వచ్చిన వెంకటేశ్వర చాగంరెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. టెక్సాస్‌లోని శాన్ ఆంటోనియోలో స్టూడెంట్ వీసాపై నివసిస్తున్న చాగంరెడ్డిని ఈ కేసులో ఏప్రిల్‌లోనే దోషిగా నిర్ధారించగా.. తాజాగా కోర్టు 30 నెలల జైలు శిక్షతోపాటు పరిహారం, మూడేళ్ల పర్యవేక్షణను ఖరారు చేసింది.

# గుండ్ల కుంటలో ఘనంగా హనుమాన్ ర్యాలీ విగ్రహ అభిషేకం

- అనంతరం భక్తులకు అన్నదానం
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్

**కొడంగల్ మున్సిపల్, సెప్టెంబర్, 11 (సమయం న్యూస్)** శ్రావణమాసం ముగింపు సందర్భంగా నేటి అమావాస్యను పురస్కరించుకుని కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు గుండ్ల కుంట గ్రామంలో హనుమాన్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. గుండ్లకుంట గ్రామ ప్రజలు, పెద్దల సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హనుమాన్ స్వామి విగ్రహానికి ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు.అభిషేక కార్యక్రమం అనంతరం భక్తులు, గ్రామ ప్రజల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ స్వయంగా భక్తులకు అన్నం వడ్డించి, కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా చైర్మన్ నందారం ప్రశాంత్ మాట్లాడుతూ..ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామ ప్రజల్లో భక్తిభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు. హనుమాన్



ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు కలిసి ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో హనుమాన్ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, మహిళలు, యువత మరియు గుండ్లకుంట గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మార్పు వైపు అడుగులు.. కాషాయ గూటికి చేరికలు

- కాషాయ గూటికి బీఆర్ఎస్ సీనియర్ నేతలు... దుగ్గొండిలో బీజేపీ జోరు
- యువ నాయకత్వానికి కాషాయ స్వాగతం... డా.గోగుల రాణాప్రతాప్ రెడ్డి



**దుగ్గొండి/వరంగల్, సెప్టెంబర్ 11 (సమయం న్యూస్) :** దుగ్గొండి మండలంలో భారతీయ జనతా పార్టీకి బలం పెరుగుతోంది. మహ్మదాపురం గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం బీజేపీలో చేరారు. మండల అధ్యక్షుడు నేదురు రాజేందర్ అధ్యక్షతన నిర్వహించిన చేరికల కార్యక్రమానికి బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా. గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీలో చేరిన వారికి ఆయన కాషాయ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. మహ్మదాపురం 3వ వార్డు సభ్యుడు బొడిగె చిరంజీవి, 9వ వార్డు బీఆర్ఎస్ పోటీ అభ్యర్థి ఎద్దు శ్రీధర్, ఆటో యూనియన్ మాజీ అధ్యక్షుడు నేదురు రాజశేఖర్, కొండ్రోజు కార్తీక్, ఎద్దు శ్రీకాంత్, చొప్పరి సాంబరాజు, చొప్పరి నాగరాజు, ఎద్దు సన్ని తదితరులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా డా. గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ నర్సంపేట నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు కాలం చెల్లిందని అన్నారు. ఆ రెండు పార్టీల పునాదులు కదిలి పోతున్నాయని, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు బీజేపీ వైపు చూస్తున్నారని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని అవినీతి రహిత, అభివృద్ధి పాలన, జాతీయవాద భావజాలానికి ఆకర్షితులై యువత పెద్ద సంఖ్యలో బీజేపీలో చేరుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కుటుంబ పాలన, అవినీతి, దోపిడీ జరిగిందని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలులో వైఫల్యంతో ప్రజలు విసిగిపోయారని విమర్శించారు. నియోజకవర్గంలో బీజేపీ చేపడుతున్న ప్రజా పోరాటాలు, సేవా కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. రాబోయే రోజుల్లో నర్సంపేట గడ్డపై కాషాయ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, ప్రాధాన్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్ల మెంట్‌కో–కన్వీనర్ కట్ల రామచంద్రారెడ్డి, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బానోతు రమేష్, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగుల జీవన్, నియోజకవర్గ నాయకుడు జూలూరి మనీష్‌గౌడ్, నర్సంపేట పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్, నర్సంపేట రూరల్ మండల అధ్యక్షుడు తనుగుల అంబేద్కర్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ దయాకర్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి నూతనకంటి శ్రీనివాస్, మహ్మదాపురం బూత్ అధ్యక్షుడు బూర్ల రవి, సీనియర్ నాయకులు పాలడుగుల శివ, కూడుతాల నగేష్, శ్రీరామోజు గురుమూర్తి, బోడిగె అనిల్, ఎద్దు సందీప్, పొన్నం రమేష్, మురహరి సురేష్, దండు శ్రీకాంత్, నేదురు వంశీ తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న కనకం గుంతల పూడ్చివేత పనులు

**కొడంగల్ మండలం, సెప్టెంబర్, 11( సమయం న్యూస్)**

పనుల పురోగతిని పరిశీలించిన ప్రజా ప్రతినిధులు, నాయకులు – వేగంగా పనులు జరుగుతున్నందుకు హర్షం



కొడంగల్ మండలం పర్సాపూర్ గ్రామంలో కనకం గుంతల పూడ్చివేత పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. గ్రామంలో జరుగుతున్న పనుల పురోగతిని ఈరోజు పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు సందర్శించి పరిశీలించారు.పనులు ఏ విధంగా కొన సాగుతున్నాయో పరిశీలించడంతో పాటు, పనుల పురోగతిపై పంచాయతీరాజ్ ఏఈ సంపత్ సంబంధిత వివరాలను నాయకులకు వివరించారు. పనులు శరవేగంగా కొనసాగుతుండటంపై నాయకులు, గ్రామస్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాధా శ్రీనివాస్ రెడ్డి, కొడంగల్ మండల కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ తట్టేపల్లి రాములు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉప్పరి శ్రీశైలం, గ్రామ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బి. నర్సింలు గారు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు హనుమంతు, సురేష్, రమేష్ తదితరులు, అలాగే గ్రామస్తులు పాల్గొన్నారు.గ్రామ ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి, వాటిని వేగంగా పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్న తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అలాగే కొడంగల్ తాలూకా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తిరుపతి రెడ్డి గార్లకు పర్సాపూర్ గ్రామ ప్రజలు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.అభివృద్ధి పనులు కేవలం ప్రారంభించడం మాత్రమే కాకుండా, వాటిని వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావడమే ప్రభుత్వ లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు.పర్సాపూర్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు ఇదే వేగంతో పూర్తయి గ్రామ ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు అందాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.

# మృతురాలి కుటుంభానికి ఆర్థిక సాయం అందజేసిన వాకిటి

**వలిగొండ సెప్టెంబర్ 11(సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల సీనియర్ రిపోర్టర్ ఆలకుంట్ల కృష్ణ మాతృమూర్తి ఆలకుంట్ల మల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వాకిటి అనంతరెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి 5 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెముడాల అనిత నర్సింగ్ యాదవ్, బొడ్డు వెంకటరమణ రెడ్డి, వలిగొండ పీఏసీఎస్ డైరెక్టర్ కల్కూరి చంద్రయ్య, ఉప సర్పంచ్ బూడిద నాగరాజు, శ్రీదేవి భూదేవి వెంకటేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ గంజి అశోక్, కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు చెవ్వ మధు ముదిరాజ్, వార్డు సభ్యులు ఉక్కుర్తి పద్మ నరసింహ, నిమ్మల వెంకటయ్య, పోలేపల్లి ప్రభాకర్, మారబోయిన మత్స్యగిరి, గంగదారి అశోక్,ఉకుర్తి శీను, బోదాసు దుర్గయ్య, పిట్టల వెంకన్న, ఆలకుంట్ల రాములు, బూడిద రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# కలెక్టరేట్‌లో మట్టి గణపతుల పంపిణీ



**నిజామాబాద్, సెప్టెంబర్ 11( సమయం న్యూస్)** పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతి విగ్రహాలను వినియోగించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం నిజామాబాద్ కలెక్టరేట్‌లో హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రసాయనిక రంగులతో తయారైన విగ్రహాల వల్ల జల వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రజలు మట్టి గణపతులను ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు.

కార్యక్రమంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, డీఆర్ఓ గీత, ఆర్డీఓలు రాజేంద్రకుమార్, విజయ కుమారి, రెవెన్యూ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# గుర్నాథ్ పల్లి సబ్ సెంటర్లో పోషకాహార వారోత్సవాలు



**వలిగొండ సెప్టెంబర్ 11 (సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం గుర్నాథ్ పల్లి అంగన్వాడి సెంటర్లో అంగన్వాడి టీచర్ తోట అలివేలు మంగమ్మ ఆధ్వర్యంలో పోషకాహార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక సర్పంచ్ ఆవుల నరసింహ హాజరైనారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ మాట్లా డుతూ గర్భిణీలు బాలింతలు పోషణ కలిగినటువంటి ఆహార పదార్థాలు ఆకు కూరలు పాలు గుడ్లు బెల్లం పల్లీలు నువ్వులు మునగ ఆకు మొదలగు ఆహార పదార్థాలు రోజువారి తినే ఆహారంలో తీసుకోవాలని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పంతుల ప్రశాంత్, వార్డ్ మెంబర్స్ జక్క రఘు, నకరికంటి గీత, పంచాయతీ కార్యదర్శి శ్రీశైలం, ఆశ కార్యకర్త కేతం సౌజన్య, గర్భవతులు బాలింతలు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# 'కుప్లా 'కు నూతన కమిటీ ఏర్పాటు చేయాలి

- పార్ట్ టైం అధ్యాపకుల సమస్యలకు పరిష్కారం చూపాలి
- ఎన్నికలే పరిష్కార మార్గం.. కుప్లా కమిటీ కోసం రిజిస్ట్రార్‌కు అధ్యాపకుల వినతి



**హనుమకొండ, సెప్టెంబర్ 11 (సమయం న్యూస్) :** కాకతీయ యూనివర్సిటీ పార్ట్‌టైం టీచర్స్ అసోసియేషన్ (కుప్లా)కు ఎన్నికలు నిర్వహించి నూతన కమిటీని ఏర్పాటు చేయాలని వివిధ విభాగాల పార్ట్‌టైం అధ్యాపకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రంకు వినతిపత్రం సమర్పించారు. గత కమిటీ రద్దయి కొన్ని సంవత్సరాలు గడిచినప్పటికీ నూతన కమిటీ ఏర్పాటు కాకపోవడంతో పార్ట్ టైం అధ్యాపకుల సమస్యలను యూనివర్సిటీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లే ందుకు సమన్వయ వేదిక లేకుండా పోయిందని అధ్యాపకులు తెలిపారు. విశ్వవిద్యాలయంలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 150 మందికి పైగా పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలకు పరిష్కారం చూపేందుకు ఎన్నికల ద్వారా ప్రతినిధి కమిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అధ్యాపకుల వినతిని స్వీకరించిన రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం గతంలో జరిగిన కుప్లా ఎన్నికల ప్రక్రియను పరిశీలించి, నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన పార్ట్‌టైం అధ్యాపకులు పాల్గొన్నారు.

# వరి ధాన్యము కొనుగోలుకు సంబంధించి సన్నాహక సమావేశం



**వికారాబాద్,సెప్టెంబర్,11(సమయం న్యూస్)** వికారాబాద్: జిల్లా అదనపు కలెక్టర్ కార్యాలయములో ఖరీఫ్ వానాకాలము 2026–27 కాలమునకు సంబంధించి వరి ధాన్యము కొనుగోలు కార్యక్రమమునకు సంబంధించి శుక్రవారం సన్నాహక సమావేశము ఏర్పాటు చేసినారు.ఈ సమావేశములో పౌరసరఫరాల సంస్థ కొనుగోలు చేయబోయే ధన్యము యొక్క పరిమాణము120000 mts 129 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలనే అంశాలపై చర్చ జరిగినది.ఈ కార్యక్రణములో జిల్లా అదనపు కలెక్ట ర్,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, అదనపు డీఆర్డీఓ, జిల్లా మార్కుఫెడ్ డిఎం,డిస్ట్రి క్ మార్కెటింగ్ ఆఫీసర్ డిసిఎస్ సి, మరియు డిఎం సీ ఎస్ సి పాలుగోన్నారు.

# సీఎం ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

**నిర్మల్, సెప్టెంబర్ 11( సమయం న్యూస్)** జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సీఎం ప్రజావాణి దరఖాస్తులను ఆలస్యం లేకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తుల వివరాలను పరిశీలించారు. ప్రతి దరఖాస్తును నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. జిల్లా స్థాయిలో పరిష్కరించలేని దరఖాస్తులను వెంటనే ఉన్నతాధికారులకు పంపించాలని ఆదేశించారు. అనంతరం మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 9వ రాష్ట్రీయ పోషణ మాసం గోడప్రతులను కలెక్టర్ ఆవిష్కరించారు. అక్టోబర్ 8 వరకు పోషకాహారం, ఆరోగ్యంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో రాథోడ్ రమేష్, ఆర్డీవో దేవీదాస్, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో మట్టి గణపతుల తయారీపై కార్యశాల




**కొడంగల్ మున్సిపల్,సెప్టెంబర్,11(సమయం న్యూస్)** కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో శుక్రవారం కళాశాల వృక్ష శాస్త్ర విభాగము, ఎకో క్లబ్ మరియు ఎన్. ఎస్. ఎస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు మట్టి గణపతుల తయారీపై కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు బంకమట్టి మరియు వివిధ ప్రకృతి సిద్ద మైన పదార్థాలతో ఆకర్షణీయమైన వినాయక విగ్రహాలను తయారు చేశారు. ఈ సందర్బంగా ప్రిన్సిపాల్ డా. బి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్లా స్టర్ ఆఫ్ పారిస్ మరియు కృత్రిమ వర్ణాలతో తయారు చేసిన విగ్రహాల వల్ల అనేక పర్యావరణ సంబంధ సమస్యలు తలెత్తడమే గాక వాటి తయారీ ఖర్చు కూడా ఎక్కువన్నారు. ప్లా స్టర్ ఆఫ్ పారిస్ నీటిలో ఇంకా గట్టిపడి నెలల తరబడి అదేవిధంగా ఉండి జలావరణానికి ఎంతో నష్టం కల్గిస్తుందన్నారు. విగ్రహాల తయారీ లో ఉపయోగించే కృత్రిమ వర్ణాలలో క్రోమియం, కాడ్మియం, అర్సెనిక్, పాదరసం, సీసం వంటి భారలోహాలు ఉండడం వల్ల మానవుల్లో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. వీటికి ప్రత్యామ్నాయంగా సహజ సిద్దమైన పసుపు, జాజు, ముల్తాని మట్టి, వృక్ష సంబంధ వర్ణాలను ఉపయోగిస్తే పర్యావరణానికి ఎంతో మేలుచేసినవరమవుతామన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ స్పృహతో మెలగాలన్నారు. ఉత్తమ విగ్రహాలను తయారు చేసిన విద్యార్థులకు బహుమతుల్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రఫియా ఖానం ఎకో క్ల బ్ కోఆర్డినేటర్ డా. ఆర్. శ్రీనివాస్, ఐ. క్యూ. ఎ. సి కోఆర్డినేటర్ టి. రాంబాబు, డా. కె. రమేష్ బాబు డా. వి. శ్రీధర్ కుమార్, డా. యం. హరిప్రియ, కె. అన్నపూర్ణ ఇతర అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## 18–55 ఏళ్ల బీసీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ

### ఈ నెల 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి



**సంగారెడ్డి సమయం న్యూస్ సెప్టెంబర్ 11:** జిల్లాలోని బీసీ మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రోత్సాహం అందించేందుకు ఇంటింటికి ఇందిరమ్మ కుట్టు మిషన్ల పంపిణీ పథకం కింద ఉచిత కుట్టు మిషన్ల పంపిణీకి అర్హులైన మహిళలు సెప్టెంబర్ 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన మహిళలు http://tgobmms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకొనుటకు ఈ నెల 15 చివరి తేదీ అని తెలిపారు. దరఖాస్తుదారుల వయస్సు 18 నిండి 55 సంవత్సరాల లోపు ఉండాలని, నిరుద్యోగ మహిళలు, నిరుపేదలు, నిరాధారణకు గురైన వితంతు, ఒంటరి, వికలాంగులు, అనాధ మహిళలకు, టైలరింగ్ ట్రైనింగ్ సర్టిఫికెట్ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. నివాసం, కులం, ఆదాయం, ఆధార్, విద్యార్హత, టైలరింగ్ శిక్షణకు సంబంధించిన ధ్రువపత్రాలు, తెల్ల రేషన్ కార్డ్ లేదా ఆహార భద్రత కార్డు కలిగి ఉండాలని, కనీస అక్షరాస్యత తప్పనిసరి అని, ఎక్కువ దరఖాస్తులు వస్తే కనీస విద్యార్హత ఐదవ తరగతి పాసైన వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. కుటుంబంలో ఒకరికి మాత్రమే అవకాశం ఉంటుందని, కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణులకు 1.50 లక్షలు, పట్టణ వాసులకు రెండు లక్షల లోపు ఉన్నవారు అర్హులని తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో బీసీ స్వయం ఉపాధి పథకం కింద ఆర్థిక లబ్ధి పొందిన వారు అర్హులు కాదని స్పష్టం చేశారు. దరఖాస్తుదారులు దరఖాస్తులను సంబంధిత వెబ్సైట్ నుండి డౌన్లోడ్ చేసుకుని కుల, ఆదాయ, నివాస, ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, విద్యార్హతలు, టైలరింగ్ శిక్షణ, అనుభవం తదితర ధ్రువీకరణ పత్రాలతో గ్రామీణులు సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారికి, పట్టణ ప్రాంతవాసులు సంబంధిత మున్సిపల్ కమిషనర్లకు ఈ నెల 15లోగా దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ సూచించారు.

## జర్నలిస్టు ల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ముత్యాల రమేష్ నియామకం

### ఉత్తర్వులు జారీ చేసిన జేఏసీ రాష్ట్ర చైర్మన్ తోగరి కరుణాకర్.



**రామన్నపేట సెప్టెంబర్ 11(సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట తెలంగాణ జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ముత్యాల రమేష్ నియమితులయ్యారు.ఈ మేరకు జర్నలిస్టుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ తోగరి కరుణాకర్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, వారి హక్కుల పరిరక్షణ కోసం ముత్యాల రమేష్ చేస్తున్న కృషిని గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జేఏసీ చైర్మన్ తోగరి కరుణాకర్‌కు ముత్యాల రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యలను జేఏసీ దృష్టికి తీసుకెళ్లి, వారి సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానని ముత్యాల రమేష్ పేర్కొన్నారు.ఆయన నియామకం పట్ల పలువురు జర్నలిస్టులు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## ఘనంగా ఎస్ జి ఎఫ్ క్రీడల ముగింపు

**రాయికోడ్ సమయం న్యూస్ సెప్టెంబర్11** రాయికోడ్ మండల స్థాయి 70వ ఎస్ జి ఎఫ్ క్రీడల ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది ఈ నెల 10 11 వ తేదీలలో రాధాకృష్ణ ఉన్నత పాఠశాల క్రీడ మైదానంలో నిర్వహించిన క్రీడలలో మండలంలో నీ వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.అండర్ 14 అండర్ 17 విభాగంలో జరిగిన క్రీడపోటీలలో విద్యార్థులు పాల్గొని వారి క్రీడ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీ నర్సింలు గారు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని , క్రీడలు మానసిక ఆరోగ్యానికి మంచివి,మరియు శారీరక దారుఢ్యం కొరకు క్రీడలు ఆడాలని మండలం లోని అన్ని పాఠశాలల్లో క్రీడలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

# 'ఆశా'ల డిమాండ్లకు అరెస్టులతో సమాధానమా?

- వెయ్యి రోజులైనా హామీలు అమలు కాలే...
- అడిగితే అరెస్టులు.. ఇదేనా ప్రజాపాలన?
- ఆశాల గళం నొక్కేస్తారా?...బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు




**నర్సంపేట/వరంగల్, సెప్టెంబర్ 11 (సమయం న్యూస్) :** ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నించేందుకు హైదరాబాద్‌కు వెళ్తున్న ఆశా వర్కర్లను, బీఆర్‌టీయూ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజును అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన వాటినే అమలు చేయాలని అడిగితే అరెస్టులు చేయడం దారుణమని మండిపడ్డారు. అరెస్టులను ప్రజాస్వామికవాదులు, మేధావులు తీవ్రంగా ఖండించాలని పిలుపునిచ్చారు. ఆశా వర్కర్ల న్యాయమైన సమస్యలను పరి ష్కరిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొని వెయ్యి రోజులు గడిచినా హామీలు అమలు కాలేదని యువరాజు అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో ఆశా వర్కర్ల సమస్యలపై చర్చించి, వారికి నెలకు రూ.18 వేల వేతనం, సామాజిక భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరేందుకు హైదరాబాద్‌కు వెళ్తుండగా అరెస్టులు చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో ప్రజాపాలన లేదని, పోలీసుల ఆధ్వర్యంలో నిర్బంధం కొనసాగు తోందని ఆరోపించారు. ఇది ప్రజాస్వా మ్యానికి గొడ్డలిపెట్టువంటిదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశా వర్కర్లు కొత్త డిమాండ్లు ఏమీ కోరడం లేదని, జాబ్‌చార్ట్‌లో పేర్కొన్న విధులు నిర్వర్తిస్తూ, పారితోషికాల స్థానంలో స్థిర వేతనాలు ఇస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీలనే అమలు చేయాలని అడుగుతున్నారని తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా తమ హక్కుల కోసం పోరాడుతున్న వారిని అరెస్టులతో అణచివేయాలని చూడటం సరి కాదన్నారు. ఇదే విధంగా నిర్బంధాలు కొనసాగిస్తే రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని గోనె యువరాజు హెచ్చరించారు.

# బలహీనులకు బాసట.. మహిళలకు భరోసా

- డా.అనితారెడ్డి సేవలకు చాకలి ఐలమ్మ అవార్డు
- సామాజిక సేవలను గుర్తించి 'బ్రేవరీ అండ్ సోషల్ జస్టి స్ అవార్డు-2026' ప్రదానం
- ఐలమ్మ బాటలో.. సేవా స్ఫూర్తితో... అనితా రెడ్డి అడుగులు






**హనుమకొండ, సెప్టెంబర్ 11 (సమయం న్యూస్) :** సమాజ సేవలో విశేషంగా కృషి చేస్తున్న అనురాగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు డా.అనితారెడ్డికి 'చాకలి ఐలమ్మ బ్రేవరీ అండ్ సోషల్ జస్టిస్ అవార్డు–2026' లభించింది. నీతి ఆయోగ్, మనం ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. కులమతాలకు అతీతంగా ఆమె అందిస్తున్న సేవలు, మహిళల విద్య, వైద్యం, ఆర్థికాభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు సంస్థ ఫౌండర్ చైర్మన్ అడ్వకేట్ డాక్టర్ చక్రవర్తి తెలిపారు. మానవ హక్కుల పరిరక్షణ, కులమత వివక్షకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడటం, యువతను విలువలతో తీర్చిదిద్దడం, మహిళలు మోసాలకు గురికాకుండా అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి, ప్రజల్లో సామాజిక మార్పు తీసుకురావడానికి అనితారెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఇలాంటి సేవలను గుర్తించి అవార్డు అందించడం చాకలి ఐలమ్మకు ఇచ్చే ఘన నివాళి అని డాక్టర్ చక్రవర్తి పేర్కొన్నారు.

**బాధ్యత మరింత పెరిగింది...**

అవార్డు అందుకున్న డాక్టర్ అనితారెడ్డి మాట్లాడుతూ పురస్కారం లభించడం ఎంతో సంతోషంగా ఉందని, అదే సమయంలో తన బాధ్యత మరింత పెరిగిందన్నారు. మహిళల ఎదుగుదల, సమానత్వం, కులమతాలకు అతీతంగా మనుషులు పరస్పరం గౌరవించుకుని సహకరించుకునే సామాజిక మార్పు చూడాలన్నదే తన లక్ష్యమని తెలిపారు. విలువలతో కూడిన యువతను తీర్చిదిద్దడంలో తన వంతు పాత్ర పోషిస్తూ సమాజ సేవను బాధ్యతగా కొనసాగిస్తానన్నారు. అవార్డులు రావడం గొప్ప కాదని.. వాటికి మరింత వన్నె తెచ్చేలా పనిచేయడమే ముఖ్యమని పేర్కొన్నారు. మాటలతో కాకుండా చేతలతో తన సేవను నిరూపిస్తానని డాక్టర్ అనితారెడ్డి పేర్కొన్నారు.

# పర్యావరణహితంకోసంమట్టి వినాయకులను పూజిద్దాం..

- మట్టి గణపతి కోసం గట్టి సంకల్పం..
- మట్టి వినాయకుల తయారీ కోసం విద్యార్థులకు శిక్షణ..



**కోస్గి మండలం, సెప్టెంబర్, 11 (సమయం న్యూస్)** పర్యావరణాన్ని కాపాడుకునే దిశలో మట్టి గణపతులను ఏర్పాటు చేసుకునేందుకు అందరం గట్టి సంకల్పం తీసుకోవాల్సిన అవసరం ఉందని మద్దూర్ ఎంఈఓ జనార్దన్ రెడ్డి అన్నారు. శుక్రవారం కోస్గి మండలం మీర్జాపూర్ గ్రామ ఉన్నత పాఠశాలలోని ఎర్త్ క్ల బ్ ఆధ్వర్యంలో పర్యావరణ హిత వినాయక చవితి అనే అంశం పై జరిగిన ప్రత్యక్ష అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సకల జీవులకు మట్టి జీవనాధారమని వినాయక చవితి సందర్భంగా ప్రతి ఇంట పర్యావరణ హిత మట్టి వినాయకులను ఏర్పాటు చేసుకోవలన్న ఉద్దేశంతో పాఠశాల విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం అభినందనీయమని అన్నారు. పండుగ వేడుకల్లో కాలుష్యనికి కారణంగా అవుతున్న విధానాలు మానుకోవాలని సహజ మైన పువ్వులు ఆకులతో అలంకరణ చేసుకోవాలని భోజనాలు,తీర్థ ప్రసాదాల వితరణ,వంటి సమయాల్లో ప్లా స్టిక్ వాడకం రద్దు చేయాలని అన్నారు.అన్నదాన కార్యక్రమల్లో సహజ విస్తార్లు లేదా స్టీ ల్ పాత్రలు వాడుకోవాలని సూచించారు. సులభంగా మట్టితో వినాయక విగ్రహాలను తయారు చేసుకోవడంపై ఎర్త్ క్ల బ్ కోఆర్డినేటర్ వార్ల మల్లే శం విద్యార్థులకు శిక్షణ ఇస్తూ వారితో విగ్రహాలను తయారు చేయించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటూ తమ నైపుణ్యాలు ప్రదర్శించారు. అత్యుత్తమ వాటిని ఎంపిక చేసి బహుమతులు అందించారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానోపాధ్యా యులు సిద్ధి రాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాల బందోబస్తులో అప్రమత్తంగా, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి





**జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS**

**నారాయణపేట, సెప్టెంబర్, 11 (సమయం న్యూస్)** గణేష్ ఉత్సవాలు, గణేష్ నిమజ్జనం సందర్భంగా జిల్లా లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ సూచించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ విభాగం సిబ్బందితో ఎస్పీ సమావేశమై ఉత్సవాల సందర్భంగా చేపట్టాల్సిన బందోబస్తు ఏర్పాట్లు, సిబ్బంది విధులు, అప్రమత్తత తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు.గణేష్ ఉత్సవాలు పూర్తయ్యే వరకు ప్రతి ఒక్క పోలీస్ అధికారి, సిబ్బంది తమకు కేటాయించిన విధుల్లో పూర్తి అప్రమత్తతతో ఉండాలని ఎస్పీ సూచించారు. విధుల పట్ల క్రమశిక్షణ, అంకితభావం, బాధ్యతాయుత వైఖరితో పనిచేయాలని, ఎలాంటి పరిస్థితులు ఎదురైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఎల్ల వ్వుడూ సిద్ధంగా ఉండాలని తెలిపారు.గణేష్ నిమజ్జనం పూర్తయ్యే వరకు అత్యవసర పరిస్థితులు మినహా ఎవరికీ సెలవులు ఉండవని, ప్రతి ఒక్కరూ జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోనే అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. అత్యవసర సమయంలో సిబ్బంది అందుబాటులో ఉండటం ద్వారా బందోబస్తు విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని తెలిపారు.ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసులు సివిల్ పోలీస్ విభాగానికి వెన్నెముకలాంటి వారని ఎస్పీ పేర్కొన్నారు. గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా సివిల్ పోలీసులతో సమన్వయంతో పనిచేస్తూ బందోబస్తు విధులను విజయవంతంగా నిర్వహించేందుకు ఆర్మ్డ్ రిజర్వ్ సిబ్బంది కీలక పాత్ర పోషించాలని సూచించారు. సిబ్బంది మధ్య సమన్వయం, సమాచార మార్పిడి, టీమ్ వర్క్‌తో విధులు నిర్వహించాలని అలాగే ఉత్సవాల సమయంలో ప్రజలతో మర్యాదగా,సంయమనంతో ఉండాలని తెలిపారు.ఈ సందర్భంగా ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ సిబ్బంది వారి విధులు, సమస్యలు, ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి ఏవైనా సమస్యలు లేదా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి నేరుగా తీసుకురావాలని, వాటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. విధులు నిర్వహించే సిబ్బంది సంక్షేమానికి పోలీస్ శాఖ ఎల్ల వ్వుడూ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.గణేష్ ఉత్సవాల సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు తదితర అంశాలపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించిందని, ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని ఎస్పీ తెలిపారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఎం.డి రియాజ్ హుల్ హక్, డీఎస్పీ మహేష్, RI విజయ్ భాస్కర్, ఎస్.బి ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి, ఆర్.ఎస్సై లు శివ శంకర్, శ్వేత, శిరీష, శివయ్య, ఆర్మ్డు రిజర్వ్ పోలీసులు పాల్గొన్నారు.



# యూఎస్ ఓపెన్ ఫైనల్లో రిబకినా వర్సెస్ సబలెంకా

**న్యూయార్క్, సెప్టెంబర్ 11 (సమయం న్యూస్):** యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో శనివారం జరగనున్న ఫైనల్ పోరు అభిమానుల్లో తీవ్ర ఉత్కంఠను రేకెత్తిస్తోంది. ప్రపంచ నంబర్ వన్, టాప్ సీడ్ అరినా సబలెంకాతో రెండో సీడ్ ఎలెనా రిబకినా టైటిల్ సమరంలో తలపడనుంది. గురువారం రాత్రి జరిగిన తీవ్ర సంచలనాత్మక సెమీఫైనల్ పోరులో రిబకినా 3-6, 6-4, 6-4 తేడాతో అమెరికా క్రీడాకారిణి కోకో గాఫ్‌పై విజయం సాధించి తొలిసారి యూఎస్ ఓపెన్ ఫైనల్లోకి అడుగుపెట్టింది. మరో సెమీస్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ అరినా సబలెంకా 7-5, 6-2 స్కోరుతో జెస్సికా పెగులాను ఓడించి హ్యాట్రిక్ టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచింది. ఈ ఇద్దరు దిగ్గజ ప్లేయర్లు ఫైనల్‌కు చేరుకోవడంతో యూఎస్ ఓపెన్ చరిత్రలో మరో అరుదైన ఘట్టం ఆవిష్కృతమైంది. 2013లో సెరెనా విలియమ్స్, విక్టోరియా అజరెంకా మధ్య జరిగిన ఫైనల్ తర్వాత, మళ్లీ 13 ఏళ్ల విరామం అనంతరం టోర్నీలోని టాప్-2 సీడ్లు ఫైనల్లో తలపడటం ఇదే తొలిసారి. ప్రదర్శనతో ఇప్పటికే డబ్ల్యూటీఏ ర్యాంకింగ్స్‌లో ప్రపంచ నంబర్ వన్ స్థానాన్ని ఖాయం చేసుకున్న కజకిస్థాన్ స్టార్ రిబకినా, సబలెంకాపై గెలిచి తన కెరీర్‌లో మూడో గ్రాండ్‌స్లామ్ సాధించాలని పట్టుదలతో ఉంది. మరోవైపు వరుసగా మూడోసారి యూఎస్ ఓపెన్ ట్రోఫీని ముద్దాడి చరిత్ర సృష్టించాలని సబలెంకా భావిస్తోంది. ఆర్థర్ యాష్ స్టేడియంలో జరిగే ఈ హై-వోల్టేజ్ ఫైనల్ పోరు టెన్నిస్ ప్రియులకు అసలైన విందు అందించనుంది.



# దాయాదిపై గోల్స్ వర్షం.. భారత్ జయభేరి!

## పాకిస్థాన్‌పై 19-0తో ఘన విజయం

## క్వార్టర్స్‌లో భారత అమ్మాయిల విధ్వంసం

## 18 పెనాల్టీ కార్నర్లు గోల్స్‌గా మలిచిన భారత్

## హ్యాట్రిక్‌తో మెరిసిన పూజా మాలిక్

## పతకానికి రెండడుగుల దూరంలో భారత జట్టు

**మోఖి (చైనా), సెప్టెంబర్ 11 (సమయం న్యూస్):** జూనియర్ ఆసియా కప్‌లో భారత మహిళల హాకీ జట్టు జోరు కొనసాగుతోంది. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను ఏకంగా 19-0 గోల్స్ తేడాతో చిత్తుచేసింది. ఆరంభం నుంచి పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన భారత అమ్మాయిలు గోల్స్ వర్షం కురిపించి పతకానికి రెండడుగుల దూరంలో నిలిచారు. పెనాల్టీ కార్నర్లను సద్వినియోగం చేసుకోవడంలో భారత్ అదరగొట్టింది. ఏకంగా 18 పెనాల్టీ కార్నర్లను గోల్స్‌గా మలిచి పాకిస్థాన్ రక్షణ శ్రేణిని ఉక్కిరిబిక్కిరి చేసింది. తొలి రెండు క్వార్టర్లలో ఐదేసి గోల్స్ సాధించిన భారత్.. చివరి క్వార్టర్‌లో మరో ఆరు గోల్స్‌తో ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. భారత్ తరఫున పూజా మాలిక్ 27, 49, 51వ నిమిషాల్లో గోల్స్ చేసి హ్యాట్రిక్‌తో మెరిసింది. రోష్ని, తనూజా, సుప్రియ, మధు, సనిక తలా రెండు గోల్స్ సాధించి భారీ విజయంలో కీలకపాత్ర పోషించారు. దాయాదిపై 19--0తో తిరుగులేని విజయాన్ని నమోదు చేసిన భారత అమ్మాయిలు జూనియర్ ఆసియా కప్‌లో తమ జోరును కొనసాగించారు.





# ఫైనల్‌కు భారత్

- సెమీస్‌లో బంగ్లాదేశ్‌పై ఘనవిజయం
- ఫిఫ్టీతో మెరిసిన షెఫాలి
- స్పిన్నర్ల మాయకు తోకముడిచిన బంగ్లా

**దుబాయ్, సెప్టెంబర్ 11 (సమయం న్యూస్):** మహిళల ఆసియా కప్‌లో ఎనిమిదో టైటిల్‌పై కన్నేసిన భారత్.. ఆ దిశగా మరో అడుగు ముందుకేస్తూ టోర్నీ చరిత్రలో పదో సారి ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం ముగిసిన తొలి సెమీఫైనల్స్‌లో బంగ్లాదేశ్‌పై 40 పరుగుల తేడాతో గెలిచి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. టీమిండియా నిర్దేశించిన 150 పరుగుల ఛేదనలో.. స్పిన్నర్ల ధాటికి బంగ్లా 109/7కే పరిమితమైంది. మొదట బ్యాటింగ్ చేసిన ఉమెన్ ఇన్ బ్లూ.. షెఫాలి వర్మ (40 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 64) అర్ధశతకానికి తోడు హర్మన్‌ప్రీత్ కౌర్ (24 నాటౌట్), రిచా ఘోష్ (21) రాణించడంతో నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 149 రన్స్ చేసింది. బంగ్లా తరఫున షోర్నా అక్తర్ (22), దిలారా అక్తర్ (21) టాప్ స్కోరర్లు. దీప్తి శర్మ (3/26), తెలుగమ్మాయి శ్రీచరణి (1/14), ప్రేమ (1/21) స్పిన్ మాయకు 2018 చాంపియన్లు ధాటిగా ఆడలేకపోయారు. శుక్రవారం శ్రీలంక, పాకిస్థాన్ మధ్య జరిగే రెండో సెమీస్‌లో గెలిచే విజేతతో భారత్ ఈనెల 13న జరిగే ఫైనల్‌లో అమీతుమీ తేల్చుకోనుంది.

### షెఫాలి మెరుపులు

టోర్నీలో మంచి టచ్‌లో ఉన్న స్టార్ ఓపెనర్ స్మృతి మందాన (2) రెండో ఓవర్లోనే ఔటై నిరాశపరిచినా షెఫాలి మాత్రం ధాటిగా ఆడింది. వ్యక్తిగత స్కోరు 1, 11 వద్ద బంగ్లా ఫీల్డర్లు క్యాచ్‌లు జారవిడవడంతో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడింది. సుల్తానా ఖటున్ వేసిన నాలుగో ఓవర్లో స్ట్రెయిట్, లాంగాఫ్ మీదుగా భారీ సిక్స్‌లు బాదింది. రబేయ ఓవర్లో ప్రతీక (20) సైతం బంతిని స్టాండ్స్‌లోకి పంపడంతో పవర్‌ప్లేను భారత్ 45/1తో ముగించింది. అయితే రబేయనే వేసిన పదో ఓవర్లో షాట్ ఆడబోయిన ప్రతీక.. కవర్స్‌లో దిలారా అక్తర్ చేతికి చిక్కడంతో 50 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. మరుఫా 11వ ఓవర్లో రెండు బౌండరీలు కొట్టిన షెఫాలి.. ఫహిమ బౌలింగ్‌లో సింగిల్‌తో ఈ టోర్నీలో రెండో అర్ధ శతకాన్ని పూర్తిచేసింది. ఆ మరుసటి ఓవర్లో 6, 4, 4తో ఇన్నింగ్స్‌కు ఊపుతెచ్చిన ఆమె.. ఐదో బంతికి డీప్ మిడ్‌వికెట్ వద్ద ఫర్జానాకు క్యాచ్ ఇవ్వడంతో భారత్ మూడో వికెట్ కోల్పోయింది. ఆఖర్లో రిచా, హర్మన్ మెరుపులతో టీమిండియా మెరుగైన స్కోరు సాధించింది.

### స్పిన్ దెబ్బకు విలవిల్లాడి..

టీ20ల్లో రికార్డు ఛేదన (ఇప్పటివరకు బంగ్లా అత్యధిక ఛేదన శ్రీలంకపై 146)కు దిగిన నిగార్ సుల్తానా సేన.. భారత స్పిన్నర్ల మాయకు 20 ఓవర్లకు 109/7 మాత్రమే చేయగల్గింది. మొదట చరణి పవర్ ప్లే ఆఖరి ఓవర్లో జువారియ (14)ను ఔట్ చేసి వికెట్ల ఖాతా తెరిచింది. టీ20ల్లో ఈ ఆంధ్రా అమ్మాయికి ఇది 50వ వికెట్. 8వ ఓవర్లో బంతినందుకున్న దీప్తి.. దిలారాను వెనక్కిపంపింది. పది ఓవర్లకు ఆ జట్టు స్కోరు 46/2 మాత్రమే. ఆ తర్వాత హర్మన్‌ప్రీత్.. బంతిని ప్రేమ, షెఫాలి, దీప్తి, చరణికే ఇవ్వడంతో బంగ్లా వేగంగా ఆడలేకపోయింది. భారీ ఆశలు పెట్టుకున్న శోభనా మోస్త్రి (18) కూడా దీప్తి 14వ ఓవర్లో వేసిన బంతికి క్లీన్‌బౌల్డ్ అవగా నిగార్(19)ను ప్రేమ ఔట్ చేసింది. లోయరార్డర్‌లో షోర్నా మెరుపులతో ఆ జట్టు వంద పరుగుల మార్కును దాటగలిగింది.

### సంక్షిప్త స్కోర్లు

భారత్: 20 ఓవర్లకు 149/6 (షెఫాలి 64, హర్మన్‌ప్రీత్ 24లి, సుల్తానా 2/30, రబేయ 1/22); బంగ్లాదేశ్: 20 ఓవర్లకు 109/7 (షోర్నా 22, దిలారా 21, దీప్తి 3/26, నందని 2/10)

# సీఎస్కే షేర్లపై ధోనీకి ఆసక్తి లేదట!

- వాటా కావాలని ఎప్పుడూ అడగలేదన్న ఫ్రాంచైజీ
- శ్రీనివాసన్‌తోనూ చర్చించలేదని వెల్లడి
- ధోనీ వద్ద లక్షకుపైగా షేర్లున్నాయంటున్న కథనాలు
- ప్రైవేట్‌గా కొనుగోలు చేశారంటూ ప్రచారం
- చెన్నై తదుపరి కోచ్ ఎంపికలో ధోనీ కీలకం



**చెన్నై, సెప్టెంబర్ 11 (సమయం న్యూస్):** భారత మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ ఐపీఎల్ భవితవ్యంపై అనిశ్చితి కొనసాగుతున్న వేళ.. చెన్నై సూపర్ కింగ్స్‌లో ఆయన వాటా కొనుగోలు చేశారన్న ప్రచారం ఆసక్తికరంగా మారింది. ధోనీ ఫ్రాంచైజీలో షేర్లు కొనుగోలు చేశారంటూ ఇటీవల కథనాలు వెలువడగా.. సీఎస్కే వర్గాలు మాత్రం వాటిని తోసిపుచ్చాయి. ఫ్రాంచైజీలో వాటా కావాలని ధోనీ తమను ఎప్పుడూ అడగలేదని, ఈ అంశంపై ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశాయి. ఐపీఎల్ ఆరంభ సీజన్ నుంచే చెన్నై జట్టుతో విడదీయరాని అనుబంధం ఏర్పరచుకున్న ధోనీకి ఫ్రాంచైజీలో వాటా ఉందన్న వార్తలు ఇటీవల చర్చనీయాంశమయ్యాయి. దీనిపై సీఎస్కే అధికారి ఒకరు స్పందిస్తూ.. "ఫ్రాంచైజీలో వాటా కావాలని ధోనీ ఎప్పుడూ అడగలేదు. ఈ విషయాన్ని మేం చర్చించలేదు. వాటా అంశంపై యజమాని ఎన్. శ్రీనివాసన్‌తో ధోనీ మాట్లాడినట్లు కూడా మాకు తెలియదు" అని పేర్కొన్నారు. అయితే మరోవైపు ధోనీ ఇప్పటికే సీఎస్కే షేర్లు కొనుగోలు చేశారంటూ కొన్ని కథనాలు పేర్కొంటున్నాయి. బహిరంగ మార్కెట్లో కాకుండా ప్రైవేట్ లావాదేవీల ద్వారా ఆయన షేర్లు కొనుగోలు చేసి ఉండొచ్చన్న ప్రచారం సాగుతోంది. సీఎస్కే కంపెనీ స్టాక్ మార్కెట్‌లో నమోదుకాకపోవడంతో ఈ షేర్ల కొనుగోలు ప్రైవేట్‌గా జరిగి ఉండవచ్చని సమాచారం.

### ధోనీ వద్ద లక్షకుపైగా షేర్లు?

'క్రిక్‌బజ్' కథనం ప్రకారం ధోనీ వద్ద లక్షకుపైగా సీఎస్కే షేర్లు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. మొత్తం వాటాదారులతో పోలిస్తే ధోనీ వద్ద ఉన్న షేర్ల సంఖ్య చాలా తక్కువేనని పేర్కొంది. ప్రస్తుతం సీఎస్కే షేర్ల విలువ రూ.37.94 కోట్లుగా ఉన్నట్లు కథనాల్లో పేర్కొన్నారు. అయితే ధోనీ షేర్ల కొనుగోలుపై ఫ్రాంచైజీ అధికారిక వర్గాల ప్రకటనకు, వెలువడుతున్న కథనాలకు మధ్య భిన్నమైన సమాచారం ఉండటంతో ఈ అంశంపై ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం అమెరికాలో ఉన్న ధోనీ ఈ నెలాఖరులో స్వదేశానికి తిరిగి రానున్నట్లు సమాచారం. అనంతరం చెన్నై సూపర్ కింగ్స్ తదుపరి కోచ్ ఎంపికపై ఫ్రాంచైజీ యాజమాన్యంతో ఆయన చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఆటగాడిగా ధోనీ భవిష్యత్తుతోపాటు సీఎస్కేలో ఆయన తదుపరి పాత్ర ఏమిటన్నదీ ఆసక్తికరంగా మారింది.

# షఫాలీపై కవ్వింపు సైగలు

- ఫాతిమా సనాపై ఐసీసీ కొరడా!
- పాక్ కెప్టెన్‌కు మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా
- ఖాతాలో మరో డీమెరిట్ పాయింట్
- రెండేళ్లలో రెండో తప్పిదం
- భారత్‌తో మ్యాచ్‌లో ప్రవర్తనపై చర్య
- 7 వికెట్ల తేడాతో పాక్‌ను చిత్తుచేసిన భారత్



**దుబాయ్, సెప్టెంబర్ 11 (సమయం న్యూస్):** ఆసియా కప్-2026లో భారత్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో భారత ఓపెనర్ షఫాలీ వర్మను ఉద్దేశించి దూకుడుగా, కవ్వించేలా వ్యవహరించిన పాకిస్థాన్ మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ ఫాతిమా సనాపై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని లెవల్-1 నిబంధన, ఆర్టికల్ 2.5ను ఉల్లంఘించినందుకు ఆమె మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా విధించడంతోపాటు ఖాతాలో ఒక డీమెరిట్ పాయింట్‌ను జత చేసింది. శనివారం దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో భారత్ లక్ష్యఛేదనకు దిగింది. రెండో ఓవర్ చివరి బంతికి షఫాలీ వర్మను కాట్ అండ్ బౌల్డ్‌గా ఔట్ చేసిన ఫాతిమా.. ఆ తర్వాత పెవిలియన్ వైపు వెళ్లాలంటూ దూకుడుగా సైగలు చేసింది. ప్రత్యర్థి బ్యాటర్‌ను రెచ్చగొట్టేలా ఉన్న ఈ చర్యను ఐసీసీ నిబంధనల ఉల్లంఘనగా పరిగణించింది. గత 24 నెలల్లో ఫాతిమా సనా చేసిన రెండో తప్పిదం ఇదే కావడంతో ఆమె ఖాతాలో డీమెరిట్ పాయింట్ల సంఖ్య రెండుకు చేరింది. ఆన్‌ఫీల్డ్ అంపైర్ల ఫిర్యాదు మేరకు ఎమిరేట్స్ ఐసీసీ ఇంటర్నేషనల్ ప్యానెల్ మ్యాచ్ రిఫరీ సుప్రియా రాణి దాస్ ఈ శిక్షను ప్రతిపాదించారు. ఫాతిమా తన తప్పిదాన్ని అంగీకరించడంతో అధికారిక విచారణ అవసరం లేకపోయిందని ఐసీసీ వెల్లడించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ కేవలం 55 పరుగులకే ఆలౌటైంది. స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత మహిళల జట్టు 9 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.



# జూ. ఎన్టీఆర్ డాన్స్ అంటే ఇష్టం

ఒకప్పుడు తన అందంతో కుర్రాళ్లను కవ్వించిన భామల్లో రంభ ఒకరు. ఆమె అందం నటన ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. అప్పట్లో స్టార్ హీరోల సరసన నటించింది మిప్పించింది. తన అందంతో ఇండస్ట్రీని ఊపేసింది. సినిమాలో హీరోయిన్ గా చేస్తూనే మరో వైపు స్పెషల్ సాంగ్స్ లోనూ మెప్పించింది రంభ. అందం అభినయంతో ఉర్రుతలూగించిన రంభ ప్రస్తుతం సినిమాలకు దూరంగా ఉంటున్నారు. రంభ గతంలో ఓ ఇంటర్వ్యూలో చేసిన కామెంట్స్ ఇప్పుడు మరోసారి వైరల్ అవుతున్నాయి. ఈ ఇంటర్వ్యూలో తన కెరీర్, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను ప్రేక్షకులతో పంచుకున్నారు. అలాగే జూనియర్ ఎన్టీఆర్ గురించి కొన్ని ఆసక్తికర కామెంట్స్ చేశారు రంభ. యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. మొన్నటి వరకు టాలీవుడ్ స్టార్ హీరోగా రాణించిన తారక్, ట్రిపుల్ ఆర్ సినిమాతో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగారు. ఇప్పుడు తారక్‌కు ప్రపంచవ్యాప్తంగా అభిమానులున్నారు. ఆయన డాన్స్‌లకు సపరేట్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. టాలీవుడ్‌లో బెస్ట్ డాన్సర్ ఎవరంటే ఎన్టీఆర్ పేరే చెబుతారు. ఎన్టీఆర్ డాన్స్ గురించి ఇప్పటికే చాలామంది సెలబ్రిటీలు ప్రశంసించారు. అలాగే నటి రంభ కూడా తారక్ డాన్స్ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, జూనియర్ ఎన్టీఆర్ నటన అంటే ఎంతో ఇష్టమని తెలిపింది. తాను చేసిన ఐటెం సాంగ్స్ లో నాచోరే నాచోరే సాంగ్ అంటే ఇష్టమని రంభ చెప్పింది. ఎన్టీఆర్ డాన్స్ చేస్తే కన్నార్పకుండా చూస్తామని, ఆయన డెడికేషన్ చూస్తే పిచ్చెక్కుతుందని ఆమె పేర్కొంది. తన దృష్టిలో మైకేల్ జాక్సన్ కన్నా తారక్ బెస్ట్ డాన్సర్ అని రంభ ప్రశంసలతో ముంచెత్తింది. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రంభ మహేష్ బాబు, పవన్ కళ్యాణ్ లతో సినిమా చేయాలనే తన కోరికను కూడా బయటపెట్టింది.

# నేడు 'ఆదర్శ కుటుంబం' టీజర్ విడుదల




విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో వస్తున్న 'ఆదర్శ కుటుంబం' (హౌస్ నంబర్: 47) సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్న వారికి చిత్ర యూనిట్ ఒక అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చింది. ఈ మూవీ అధికారిక టీజర్‌ను శనివారం మధ్యాహ్నం 12 గంటలకు విడుదల చేయనున్నట్లు సోషల్ మీడియా ద్వారా అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా, నారా రోహిత్, నివేదా పేతురాజ్, రావు రమేశ్, వెన్నెల కిషోర్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకు ఎస్.ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నారు. గతంలో వెంకటేష్ హీరోగా నటించిన క్లాసిక్ హిట్స్ 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' చిత్రాలకు త్రివిక్రమ్ మాటలు అందించిన సంగతి తెలిసిందే. ఆ చిత్రాల్లోని సంభాషణలు, వెంకటేష్ కామెడీ టైమింగ్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మళ్లీ ఇన్నాళ్లకు వీరిద్దరి కాంబినేషన్‌లో పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ వస్తుండటంతో సినిమాపై విపరీతమైన క్రేజ్ నెలకొంది. ఈ చిత్రాన్ని గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. తాజా అప్‌డేట్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.

# మహిళలే తాళి ఎందుకు ధరించాలి?

ఫస్ట్ మూవీ సొంతంతో సూపర్ సక్సెస్ అందుకున్న హీరోయిన్ నమిత... ఆ తర్వాత స్టార్ హీరోస్ సరసన నటించారు. పెళ్లి తర్వాత సినిమాలకు గ్యాప్ ఇచ్చారు. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈమె... వివాహ సంప్రదాయాలు, మహిళలపై సమాజంలో మోపుతున్న బాధ్యతలు, వివక్షల గురించి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. అసలు పురుషులకు లేని నిబంధనలు మహిళలకే ఎందుకని ప్రశ్నించారు నమిత. 'ఆడవాళ్లే ఎందుకు బొట్టు పెట్టుకోవాలి? మహిళలే తాళి ఎందుకు ధరించాలి? పురుషులకు లేని రూల్స్ మహిళలకే ఎందుకు?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. అలాగే, భర్త దీర్ఘాయుష్షు కోసం మహిళలు వరలక్ష్మి వ్రతం చేసే విధానంపైనా నమిత రియాక్ట్ అయ్యారు. నా భర్త సురక్షితంగా దీర్ఘాయుష్షుతో ఉండాలని నేను ఉపవాసం ఉంటాను. కానీ, నా భార్య క్షేమం కోసం భర్త కనీసం ఏడాదిలో ఒక్క రోజైనా కేటాయించాలనే రూల్ ఉందా? సమాజం ఎందుకు అలాంటివి క్రియేట్ చేయలేదు. కట్టు, బొట్టూ విషయంలో అన్నీ రూల్స్ మహిళలకే ఎందుకు? మహిళలు తాళి ధరించాలని ఏ గ్రంథాల్లోనూ లేదు. ఇవన్నీ సమాజం సృష్టించనవే. ఎందులోనూ ఇలాంటి నిబంధనలు లేవు.' అంటూ చెప్పారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 'సొంతం' సినిమాతో టాలీవుడ్?లోకి ఎంట్రీ ఇచ్చిన నమిత తనదైన అందం, నటనతో మంచి ఫేమ్ సంపాదించుకున్నారు. ఆ తర్వాత విక్టరీ వెంకటేశ్‌తో జెమినీ చేశారు. రవితేజ, బాలకృష్ణ, శ్రీకాంత్ వంటి స్టార్స్‌తో కలిసి నటించారు. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళ భాషల్లోనూ మూవీస్ చేశారు. 2017లో పెళ్లి తర్వాత సినిమాలకు దూరమయ్యారు. చివరగా 2020లో మియా అనే తమిళ మూవీలో నటించారు. రీసెంట్‌గా సోషల్ మీడియాలో యాక్టివ్ అవుతున్నారు. మళ్లీ ఆమె మూవీస్‌లో నటిస్తారనే ప్రచారం సాగుతోంది. అయితే, దీనిపై నమిత అఫీషియల్‌గా రియాక్ట్ కాలేదు.






# విభిన్న పాత్రలను ఎంచుకుంటా

తెలుగుతో పాటు బాలీవుడ్‌లో విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ దూసుకుపోతున్న ప్రముఖ నటి రకుల్ ప్రీత్ సింగ్, తాజాగా తన కెరీర్ ఆకాంక్షలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన సినీ ప్రయాణంలో ఇప్పటివరకు పూర్తి స్థాయి, హృదయాలను హత్తుకునే ఇంటెన్స్ లవ్ స్టోరీలో నటించలేదని, అలాంటి ఎమోషనల్ రొమాంటిక్ డ్రామాలో నటించాలనే బలమైన కోరిక ఉందని వెల్లడించారు. అలాగే చారిత్రాత్మక నేపథ్యం ఉన్న పీరియడ్ డ్రామాలు లేదా హర్రర్ జోనర్‌లలో ఇప్పటివరకు భాగం కాలేదని, ఆ జోనర్లలో కూడా విభిన్నమైన ప్రయోగాలు చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు చేసిన పాత్రలకు భిన్నంగా, నటిగా తనలోని సామర్థ్యాన్ని సవాల్ చేసే స్క్రిప్ట్‌లను ఎంచుకోవడమే ఇకపై తన ప్రాధాన్యత అని ఆమె స్పష్టం చేశారు. ఇకపై సినిమాల విషయంలో బిగ్ బ్యానర్ లేదా జానర్ ప్రాధాన్యత కంటే, తను పోషించే పాత్రకు ఎంతవరకు ప్రాధాన్యం ఉందనేది ముఖ్యమని రకుల్ తెలిపారు. కేవలం తెరపై కనిపించడం మాత్రమే కాకుండా, నటిగా తనను మానసికంగా ఉత్తేజపరిచే మరియు కొత్తదనంతో కూడిన సవాలుతో కూడిన పాత్రలనే అంగీకరిస్తానని ఆమె స్పష్టంచేశారు. ప్రముఖ దర్శకుడు నితీశ్ తివారీ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం 'రామాయణం'లో రకుల్ శూర్పణఖ పాత్రలో కనిపిస్తున్నారు. రణ్‌బీర్ కపూర్ (రాముడు), సాయి పల్లవి (సీత), యష్ (రావణుడు), కాజల్ అగర్వాల్ (మండోదరి) ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ మోస్ట్ అవైటెడ్ చిత్రం మొదటి భాగం నవంబర్ 6న అంతర్జాతీయంగా విడుదల కానుంది.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **7036644111, 9490140565**

# గణేష్ నిమజ్జన పనులను పరిశీలించిన అధికారులు



**నారాయణపేట, సెప్టెంబర్, 11 (సమయం న్యూస్)** గణేష్ ఉత్సవాల సందర్భంగా విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం మరియు పోలీస్ శాఖ సమన్వయంతో ముందస్తు చర్యలు చేపడుతోంది. నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అవసరమైన అన్ని భద్రతా, మౌలిక వసతుల ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు.ఈ నేపథ్యంలో అదనపు ఎస్పీ ఎం.డి రియాజ్ ఉల్ హక్,ఆర్డీఓ రమేష్, డీఎస్పీ నల్లపు లింగయ్య, సంబంధిత పోలీస్ అధికారులు, మున్సిపల్, ఎలక్ట్రికల్, రెవెన్యూ, ఆర్&బీ తదితర శాఖల అధికారులు కలిసి నారాయణపేట జిల్లా కేంద్రంలోని కొండారెడ్డిపల్లి చెరువు, ఉట్కూరు పెద్ద చెరువు, మక్తల్ దండు మూల చెరువు, కృష్ణలోని కృష్ణ నది ప్రాంతాలను చెరువుల వద్ద నీటి మట్టాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం గణేష్ లు పెద్దగా ఉంటే చెరువులలో వాటర్ లెవెల్స్ తక్కువగా ఉన్నందున పెద్ద గణేష్ లకు కృష్ణ నదిలో లేదా ఇతర ఏర్పాట్ల ను పరిశీలించడం జరిగింది అని తెలిపారు. అలాగే భక్తులు, నిర్వాహకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున ఆయా ప్రాంతాల్లో చెరువుల్లో నీటి లోతు, నీటి పరిస్థితి, నిమజ్జన ప్రాంతాల భద్రత, లైటింగ్ సౌకర్యాలు, పరిసరాల పరిశుభ్రత, క్రేన్ల ఏర్పాటు, బ్యారికేడింగ్, వాహనాల రాకపోకలు, పార్కింగ్, ప్రజల ప్రవేశ–నిష్క్రమణ మార్గాలు తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. నిమజ్జన ప్రాంతాల్లో రాత్రి సమయంలో కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగినంత విద్యుత్ మరియు లైటింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదేవిధంగా చెరువు పరిసరాల్లో చెత్తాచెదారం లేకుండా పారిశుద్ధ్య చర్యలు చేపట్టలని సూచించారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ... జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎస్పీ ల ఆదేశాల మేరకు గణేష్ నిమజ్జన ప్రాంతాల్లో చెరువులను నీటిమట్టాలను పరిశీలించడం జరిగిందని, పై అధికారుల చర్చించి త్వరలో నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది అని తెలిపారు. కృష్ణా నదికి లేదా చెరువు లోతు ప్రాంతాలను గుర్తించి అక్కడ నిమజ్జనం చేయడానికి తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. చెరువుల వద్ద ముందస్తు అవసరమైన ఏర్పాట్లను అన్ని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు తెలిపారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా ముందస్తు ప్రణాళికతో అన్ని చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.నిమజ్జనం సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టడంతో పాటు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, ఎలక్ట్రికల్, R&B తదితర శాఖలు సమన్వయంతో పనిచేస్తాయని తెలిపారు. గణేష్ ఉత్సవాలు మరియు నిమజ్జన కార్యక్రమం శాంతియుత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ అన్ని ముందస్తు చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు. ప్రజలు, గణేష్ మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖకు పూర్తిగా సహకరించి నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# గణనాథుడి నిమజ్జనం.. ప్రకృతికి భారంగా మారొద్దు

- **మట్టి గణనాథులను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం**
- **వినాయక ఉత్సవాల్లో మట్టి విగ్రహాలకే ప్రాధాన్యమివ్వాలి... చైర్‌పర్సన్‌శ్రీలక్ష్మీరామానంద్**
- **ప్రకృతిని ప్రేమిద్దాం.. మట్టి గణపతిని కొలుద్దాం**



**నర్సంపేట, సెప్టెంబరు 11 (సమయం న్యూస్) :** పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజించాలని నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ పిలుపునిచ్చారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం నర్సంపేట మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అధికారులతో కలిసి భక్తులకు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్, నర్సంపేట టౌన్ సీఐ ముస్కు శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ కాటం భాస్కర్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల కారణంగా నర్సంపేట పరిసర ప్రాంతాల్లోని చెరువుల్లో నీటిమట్టాలు తగ్గాయని తెలిపారు. దీంతో గణపతి విగ్రహాల నిమజ్జనానికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున ఉత్సవ కమిటీలు వీలైనంత వరకు మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రజలంతా బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. మట్టి విగ్రహాలు ఏర్పాటు చేసుకునేందుకు సమయం తక్కువగా ఉన్నందున చిన్న విగ్రహాలకు ప్రాధాన్యమివ్వాలని, నిమజ్జనం సులభంగా జరిగేలా చూసుకోవాలని సూచించారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న 25వ వార్డులో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సుమారు 15 అడుగుల మట్టి గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చైర్‌పర్సన్‌తెలిపారు.

**అనుమతులు తప్పనిసరి...**

వినాయక మండపాల ఏర్పాటుకు సంబంధిత అనుమతులు, విద్యుత్ శాఖ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. పోలీస్, విద్యుత్, మున్సిపల్ శాఖల అధికారులకు సహకరిస్తూ భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించుకోవాలని కోరారు.

**మట్టి విగ్రహాలకు ఆదర్శంగా నిలుద్దాం...**

ఈ ఏడాది 25వ వార్డులో ఏర్పాటు చేస్తున్న మట్టి గణపతి విగ్రహాన్ని ఆదర్శంగా తీసుకుని వచ్చే ఏడాది నుంచి నర్సంపేట మున్సిపల్ పరిధిలో పూర్తిగా మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలని చైర్‌పర్సన్ పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గంధం నరేందర్ గుప్తా, డిప్యూటీ తహసీల్దార్ ఆంగోత్ తారాచంద్, కౌన్సిలర్లు బత్తిని రాజేందర్, ముత్తినేని వెంకన్న, మాదాసి రవి, ములుకల వినోద్ సాంబయ్య, పున్నం నరసింహారెడ్డి, బాణాల ప్రసన్న శ్రీనివాస్, చీకటి స్వరూప ఓదయ్య గౌడ్, దొంగల రజిత, హన్మకొండ శ్రీధర్, మండల శ్రీదేవి శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి: సీఐ సైదులు



**మద్దూరు మున్సిపల్, సెప్టెంబర్, 11 (సమయం న్యూస్)** మద్దూర్: గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మద్దూరు మండల పరిధిలో జరగనున్న గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు.ఇందులో భాగంగా కోస్గి సీఐ సైదులు, ఎస్సై విజయ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌తో పాటు ఇతర అధికారులు మద్దూరు శివారులోని కా చెరువును పరిశీలించారు.నిమజ్జన సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, భద్రతా ఏర్పాట్లు , వాహనాల రాకపోకలు, రద్దీ నియంత్రణ, విద్యుత్ భద్రత తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. చెరువు పరిసరాల్లో ప్రమాదాలు జరగకుండా అవసరమైన బారికేడింగ్, లైటింగ్, పోలీస్ బందోబస్తు, అత్యవసర సేవల ఏర్పాట్ల పై చర్చించారు. ఈ సందర్భంగా సీఐ సైదులు మాట్లాడుతూ... గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు పోలీసుల సూచనలు పాటించాలని, నీటి ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.నిమజ్జన సమయంలో నిర్వాహకులు, వాలంటీర్లు పోలీసు, మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ సహకరించాలని కోరారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు సూచించారు.

# జిల్లా ఖజానా కార్యాలయంలో వార్షిక తనిఖీ

- **ఖజానా నిర్వహణలో నిబంధనలు, పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలి**
- **సీనియర్ డీఏజీ ఎం. నరేష్ కుమార్**



**సంగారెడ్డి సమయం న్యూస్ సెప్టెంబర్ 11:-** తెలంగాణ రాష్ట్ర సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ ఎం. నరేష్ కుమార్ ( ఇండియన్ ఆడిట్ అండ్ అకౌంట్స్ సర్వీసెస్ అధికారి) శుక్రవారం సంగారెడ్డి జిల్లా ఖజానా కార్యాలయంలో వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈనెల 7 నుండి కొనసాగుతున్న వార్షిక ఆడిట్‌లో భాగంగా చివరి రోజున ఆయన కార్యాలయాన్ని సందర్శించి, వివిధ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌తో పాటు జిల్లాలో పనిచేస్తున్న ఏటీఓలు, ఎస్‌టీఓలతో ఆయన సమావేశమై ఖజానా నిర్వహణ, ఆడిట్ అంశాలు, కార్యాలయ విధులపై సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న ఆడిట్ అభ్యంతరాలు (Outstanding Audit Paras), ప్రస్తుత ఆడిట్ అభ్యంతరాలు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నరేష్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆర్థిక లావాదేవీల నిర్వహణలో నిబంధనలు, విధివిధానాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. IFMIS పోర్టల్ ద్వారా పేపర్‌లెస్ ఆన్‌లైన్ బిల్లు ల సమర్పణ జరుగుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు, సిబ్బంది విధి విధానాలను పూర్తిగా అవగాహన చేసుకొని, ఎలాంటి లోపాలకు తావులేకుండా బిల్లు ల ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. పెన్షనర్లకు సంబంధించిన పెన్షన్ల చెల్లింపుల ప్రక్రియను సక్రమంగా, సకాలంలో నిర్వహించాలని, అదేవిధంగా నెలవారీ అకౌంట్స్ నిర్ణీత గడువులోగా అకౌంటెంట్ జనరల్ కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. ఖజానా కార్యాలయాల్లో రికార్డులు, రిజిస్టర్లు, ఆర్థిక లావాదేవీల వివరాలను ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేసి భద్రపరచాలని, ప్రభుత్వ నిధుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం, ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని సూచించారు. జిల్లా ఖజానా కార్యాలయంలో రికార్డుల నిర్వహణ, విధుల అమలు, ఆడిట్ ప్రక్రియకు సంబంధించి చేపడుతున్న చర్యలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, ఏ టి ఓ లు, ఎస్‌టీఓలు సంపత్ స్వరూప్, రాజారెడ్డి, శారద, ఏటీఓలు, జిల్లా ఖజానా కార్యాలయంలోని వివిధ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

# బి ఎల్ ఓ మొగిలిపాక ప్రేమలత కు గ్రామపంచాయతీ సన్మానం



**వలిగొండ సెప్టెంబర్ 11(సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం మొగిలిపాక గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకముగ చేపట్టిన "సర్" కార్యక్రమం లో భాగాంగ మండలంలో మొగిలిపాక గ్రామము 100% పూర్తి చేసినందుకు బిఎల్ఓ మొగిలిపాక ప్రేమలత ని గ్రామ పంచాయతీ పాలకవర్గం సన్మానించి అభినందనలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో లక్ష్మీనరసింహ స్వామి దేవస్థాన మాజీ చైర్మన్ ముద్దసాని కిరణ్ కుమార్ రెడ్డి,స్థానిక సర్పంచ్ జడిగె బుచ్చయ్య యాదవ్ ఉప సర్పంచ్ షేక్ సైదులు,వార్డు సభ్యులు గంట భాస్కర్ ,మచ్చ అండాలు ,పబ్బు వెంకటేష్ ,పబ్బు శిరీష బాలకృష్ణ ,మచ్చ సునీత స్వామి ,సెక్రటరీ పావని మాజీ పాల సంఘం చైర్మన్ పబ్బు సత్తయ్య , బిఆర్ఎస్ నాయకులు జక్క శ్రీనురెడ్డి ,మచ్చ నవీన్ ,బీమానబోయేనా మచ్చేందర్ ,మొగిలిపాక దుర్గ ప్రసాద్ ,చలిచీమల కృష్ణ ,శ్యామల నరేష్ ,మొగిలిపాక షామంత్ ,సింగం శంకరయ్య ,పబ్బు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# డ్రోన్ పిచికారీతో సాగు ఖర్చు తగ్గింపు



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 11:( సమయం న్యూస్)** ఆధునిక సాంకేతికతను వ్యవసాయంలో వినియోగిస్తే సాగు ఖర్చులు తగ్గి, రైతులకు అధిక లాభాలు అందుతాయని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. తలమడుగు మండలం పల్సి (కె) గ్రామంలో డిజిటల్ క్రాప్ సర్వే, డ్రోన్ ద్వారా పత్తి చేనులో పురుగుమందుల పిచికారీని ఆయన పరిశీలించారు. ఫాంపాండ్లు, సమీకృత వ్యవసాయం, ప్రకృతి సాగును రైతులు ప్రోత్సహించాలని సూచించారు. గ్రామానికి చెందిన ఇద్దరు యువకులకు డ్రోన్ పైలట్ శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించినట్లు తెలిపిన కలెక్టర్, మరింత మంది యువతకు ఉచిత శిక్షణ అందిస్తామని చెప్పారు.

# కొడంగల్ లో సీసీ రోడ్డు పనులన

- **కడా ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్,కమిషనర్ బలరాం నాయక్**



**కొడంగల్ మున్సిపల్, సెప్టెంబర్,11(సమయం న్యూస్)** భూత్పూర్–చించోలి నేషనల్ హైవే పనుల్లో భాగంగా కొడంగల్ టౌన్‌లో తాండూర్ వెళ్లే ప్రధాన రహదారిపై చేపడుతున్న సీసీ రోడ్డు పనులను కడా ఆఫీసర్ వెంకట్ రెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు.కడా ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్,మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ రోడ్డు పనుల పురోగతిని పరిశీలించి, నిర్మాణ నాణ్యత, పనుల వేగం తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి, మెరుగైన రహదారి సౌకర్యం అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.ఈ పరిశీలనలో మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్ నాయక్ తో పాటు పలువురు నాయకులు ఉన్నారు.కొడంగల్ అభివృద్ధికి ప్రాధాన్యత.. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యమే లక్ష్యం.

# పర్యావరణన్నీ కాపాడే మట్టి గణేష్ విగ్రహాలను మాత్రమే ఉపయోగించాలి

**శంషాబాద్ జోనల్ కమిషనర్ కే.చంద్రకళ**

**శంషాబాద్ సమయం సెప్టెంబర్ 11:** పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహిస్తూ, వినాయక చవితి వేడుకలను పర్యావరణహితంగా నిర్వహించాలనే ఉద్దేశంతో శంషాబాద్ జోనల్ కమిషనర్ కె. చంద్రకళ, శంషాబాద్ సర్కిల్–18 డిప్యూటీ కమిషనర్ బి. సుమన్ రావు సమక్షంలో శుక్రవారం శంషాబాద్ లో పర్యావరణహిత గణేష్ విగ్రహాలను పంపిణీ గ్రీన్ ఎర్త్ ఇంటిగ్రేటెడ్ ఫెసిలిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని సంస్థ ప్రతినిధి శ్రీ నాగరాజ్ యాదవ్ సమన్వయంతో నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... పండుగలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లా స్టర్ ఆఫ్ పారిస్, రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా మట్టితో తయారు చేసిన పర్యావరణహిత గణేష్ విగ్రహాలను వినియోగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గణేష్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా నీటి కాలుష్యాన్ని నివారించేందుకు ప్రజలు పర్యావరణహిత విధానాలను పాటించాలని, పరిశుభ్రమైన మరియు పచ్చని వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని అధికారులు పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కార్యక్రమాన్ని నిర్వహించిన గ్రీన్ ఎర్త్ ఇంటిగ్రేటెడ్ ఫెసిలిటీ ప్రతినిధి శ్రీ నాగరాజ్ యాదవ్ ను అధికారులు అభినందించారు.

# హక్కుల కోసం ప్రశ్నిస్తే .. నిర్బంధాలే సమాధానమా?

- **కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక, అప్రజాస్వామిక విధానాలపై జాతీయ మానవ హక్కుల కమిషన్ కు ఫిర్యాదు... ఎంపీ వద్దిరాజు రవిచంద్ర**



**వరంగల్, సెప్టెంబరు 11 (సమయం న్యూస్) :** తెలంగాణలో ప్రజలకే కాకుండా ప్రజాప్రతినిధులకు కూడా రక్షణ లేకుండా పోయిందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌ను అణచివేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా పోలీసులు వ్యవహరించిన తీరుపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ), జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఎమ్మెల్యేలు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి , డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అంతకుముందు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులతో కలిసి జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ విజయ రహత్కర్, మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతిని కలిసి అసెంబ్లీ వద్ద చోటుచేసుకున్న ఘటనలను వివరించినట్లు తెలిపారు. అసెంబ్లీ సమావేశాల తొలిరోజు సుమారు 500 మంది పోలీసులు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై దాడికి పాల్పడ్డారని రవిచంద్ర ఆరోపించారు. మహిళా ప్రజాప్రతినిధుల చుట్టూ పురుష పోలీసులు, పురుష ప్రజాప్రతినిధులను మహిళా పోలీసులు అడ్డుకున్నారని అన్నారు. ఎమ్మెల్సీ తాతా మధును పోలీసులు దురుసుగా వ్యవహరించారని, అనంతరం ఆయనపై అనని మాటలను ఆపాదించారని పేర్కొన్నారు. పార్టీ అధినేత కేసీఆర్ సూచన మేరకు తాతా మధు తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని విచారం వ్యక్తం చేశారన్నారు. ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిలను నేరస్తుల మాదిరిగా అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించాలన్న ప్రయత్నాన్ని న్యాయస్థానం తిరస్కరించిందని, అసెంబ్లీ వద్ద పోలీసుల వ్యవహారశైలిపై హైకోర్టు కూడా తప్పుబట్టిందని రవిచంద్ర పేర్కొన్నారు.

**ప్రతిపక్షాన్ని అణచలేరు...**

ప్రధాన ప్రతిపక్షం లేవనెత్తుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేసి బయటకు పంపుతున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ సభకు రావాలని అధికారపక్షం కోరుతూనే, అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను బయటకు పంపడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. పార్ల మెంట్‌లో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ అనుసరించిన నిరసన విధానాలను ప్రస్తావిస్తూ.. కాంగ్రెస్‌కు పార్ల మెంట్‌లో ఒక విధానం, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నప్పుడు మరో విధానం ఉంటుందా? అని రవిచంద్ర ప్రశ్నించారు. రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడే కాంగ్రెస్ తెలంగాణలో ప్రజావ్యతిరేక, అప్రజాస్వామిక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. ప్రజల హక్కుల కోసం పోరాడుతున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల గొంతు నొక్కేందుకు ఎన్ని నిర్బంధాలు, కుట్రలు చేసినా వెనకడుగు వేసేది లేదన్నారు. మీడియా, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రభుత్వ విధానాలను ప్రజల ముందు ఎప్పటికప్పుడు ఎండగడతామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు 22-ఏ అంశం ద్వారా భూ వ్యవహారాలపై ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన విషయాలను కూడా రవిచంద్ర ప్రస్తావించారు.

# బీసీ జనగణనతోనే సామాజిక న్యాయం

**జనగణనలో ఓబీసీలకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలి... బీసీ సంక్షేమ సంఘం నేతలు**

**నర్సంపేట, సెప్టెంబరు 11 (సమయం న్యూస్) :** దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న జనగణనలో బీసీల జనాభాను శాస్త్రీయంగా లెక్కించాలని, ఓబీసీలకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపు మేరకు నర్సంపేటలో శుక్రవారం బీసీల ధర్మపోరాట దీక్ష నిర్వహించారు. పట్టణ ఉపాధ్యక్షుడు మద్దెల శ్యామ్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన దీక్షకు బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు, నర్సంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్, ఓబీసీ జిల్లా చైర్మన్ ఓర్సు తిరుపతి హాజరయ్యారు. మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా చేపట్టే జనగణనలో బీసీ కులగణన నిర్వహిస్తామని కేంద్ర ప్రభుత్వం 2025 మేలో నిర్ణయించిందని గుర్తుచేశారు. అయితే కులగణనకు ప్రత్యేక కాలమ్ లేకుండా జనగణన చేపట్టడం ద్వారా బీసీలకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. బీసీల జనాభా ఎంతుందో కచ్చితమైన గణాంకాలు లేకపోతే జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగాలు, సంక్షేమ పథకాలు, రాజకీయ ప్రాతినిధ్యం ఎలా నిర్ణయిస్తారని ప్రశ్నించారు. బీసీల జనాభాను కచ్చితంగా లెక్కించి, వారి సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ వెనుకబాటుతనాన్ని గుర్తించేందుకు కులగణన తప్పనిసరని పేర్కొన్నారు. దేశ జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీ, ఓబీసీ వర్గాలకు జనగణనలో ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేసి సమగ్ర కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు.

**నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమణ...**

దీక్ష అనంతరం బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకుడు బొనగాని రవీందర్, బీఆర్‌పీ పార్టీ రాష్ట్ర నాయకుడు బుర్రి సాగర్ నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు వనం మహేందర్, సీపీఎం నాయకుడు అనంతగిరి రవి, బహుజన నాయకులు ఈదుల కృష్ణ, జన్ను రవి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శులు మారబోయిన రాములు యాదవ్, సంగెం రమేష్, చీకటి ఓదేలు, జిల్లా యువజన అధ్యక్షుడు కడారి సురేష్ యాదవ్, పలువురు మండల నాయకులు, మహిళా నాయకులు, ముదిరాజ్ సంఘం ప్రతినిధులు, బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఐ డి ఓ సి భవన నిర్మాణ పనులను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ప్రియాంక

**నారాయణపేట, సెప్టెంబర్,11(సమయం న్యూస్)** ఐ డి ఓ సి సముదాయ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. శుక్రవారం నూతనంగా నిర్మిస్తున్న ఐ డి ఓ సి భవనాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. కలెక్టర్ ఛాంబర్, మినిస్టర్ ఛాంబర్ పరిశీలించారు. అలాగే టాయిలెట్స్ వాటర్ ఆర్వో ప్లాంట్ వైరింగ్ తదితర పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ వారు వెంటనే అన్ని పనులు పూర్తి చేయాలన్నారు. అలాగే మీటింగ్ హాల్లో స్క్రీ న్ ఏర్పాటు చేయాలన్నారు. భవనం బయట హార్టికల్చర్ వారు గ్రీనరీ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు . ఆర్ . అండ్.బి.ఈ.ఈ.వెంకటరమణ , డి.ఈ.రాములు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు... జిల్లా పౌర సంబంధాల అధికారి నారాయణపేట చేజారి చేయబడింది.

# వలిగొండ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం



**వలిగొండ సెప్టెంబర్ 11 (సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈరోజు జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గ్రామపంచాయతీ సర్పంచ్ కుంభం వెంకటపాపిరెడ్డి అధ్యక్షత వహించారు. సమావేశానికి ఉపసర్పంచ్, గ్రామపంచాయతీ కార్యదర్శి షేక్ రసూల్, వార్డు సభ్యులు హాజరయ్యారు. ఈ సమావేశానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలంధర్ రెడ్డి హాజరై గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. వలిగొండ గ్రామ సమగ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరి భాగస్వామ్యం, సహకారం ఎంతో అవసరమని ఆయన అన్నారు. ప్రతి వ్యక్తి తన వంతు బాధ్యతగా భావించి గ్రామ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని సూచించారు. సమావేశంలో వార్డు సభ్యులు తమ తమ వార్డుల్లో ఉన్న సమస్యలు, ప్రజల అవసరాలు మరియు చేపట్టాల్సిన అభివృద్ధి పనులను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వార్డు సభ్యులు తెలియజేసిన ప్రతి అంశాన్ని గ్రామపంచాయతీ కార్యదర్శి షేక్ రసూల్ వివరంగా నమోదు చేసి డాక్యుమెంట్ చేశారు. ఆయా వార్డుల్లో అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని సమావేశంలో చర్చించారు. ఈ సమావేశానికి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీకాంత్ రెడ్డి కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలను కాపాడటంలో ప్రతి ఒక్కరి సహకారం అవసరమని అన్నారు. ప్రతి వ్యక్తి బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ పోలీసు శాఖకు సహకరించినప్పుడే మండలంలో శాంతి, సామరస్యం మరియు సౌభ్రాతృత్వాన్ని నెలకొల్పగలమని తెలిపారు. అనంతరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలంధర్ రెడ్డిని మరియు సబ్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి ని, అలాగే నూతనంగా నియమితులైన గ్రామపంచాయతీ కార్యదర్శి షేక్ రసూల్ ని గ్రామపంచాయతీ సర్పంచ్ శ కుంభం వెంకటపాపిరెడ్డి శాలువాలతో ఘనంగా సత్కరించారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, శాంతిభద్రతలు మరియు ప్రజల సంక్షేమం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు మరియు గ్రామస్తులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు.

# దళితుల పట్ల బీఆర్ఎస్, బీజేపీలది వివక్ష వైఖరి

- **శుద్ధి రాజకీయాలతో సమాజంలో అంటరానితనాన్ని ప్రోత్సహిస్తు న్నారు**
- **మనిషి అడుగుతో అపవిత్రమయ్యే నేల ఎక్కడుంది..?**
- **నయవంచనను ప్రజల్లోకి తీసుకెళ్తాం... మానవతారాయ్, ఇనగాల వెంకట్రాంరెడ్డి**



**హనుమకొండ, సెప్టెంబరు 11 (సమయం న్యూస్) :** దళితుల పట్ల బీఆర్ఎస్, బీజేపీలు వివక్షపూరిత వైఖరిని అవలంబిస్తున్నాయని టీపీసీసీ అధికార ప్రతినిధి, వరంగల్, హనుమకొండ జిల్లా ల పార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ కోటూరి మానవతారాయ్ ఆరోపించారు. దళిత నాయకుల పట్ల అవమానకరంగా వ్యవహరిస్తూ, 'శుద్ధి' పేరుతో అంటరానితనాన్ని ప్రోత్సహించడం సిగ్గుచేటన్నారు. హనుమకొండ డీసీసీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రసంగించిన వేదికను బీజేపీ నాయకులు శుద్ధి చేయడం దళిత నాయకుడికి జరిగిన అవమానంగా అభివర్ణించారు. తెలంగాణలోనూ బీఆర్ఎస్ అదే వైఖరిని అనుసరిస్తోందని ఆరోపించారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న దళిత స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలు ఆక్షేపణీయమన్నారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్ ప్రాంతంలో దళితులు నడిచిన నేలను పసుపు నీళ్లతో శుద్ధి చేశారనే ఆరోపణలు సమాజంలో తిరిగి అంటరానితనాన్ని ప్రోత్సహించేలా ఉన్నాయని విమర్శించారు. దళిత ముఖ్యమంత్రి, మూడు ఎకరాల భూమి హామీల పేరుతో గత ప్రభుత్వం దళితులను మోసం చేసిందని ఆరోపించారు. డాక్టర్ రాజయ్యను ఉపముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించడం, మాదిగలకు మంత్రివర్గంలో తగిన ప్రాతినిధ్యం కల్పించకపోవడం దళితులకు అన్యాయం చేయడమేనన్నారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకుండా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వ్యవహరించిన తీరు, మహిళా పోలీసులు, అధికారుల పట్ల అనుచితంగా ప్రవర్తించడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విపక్షాలు చేస్తున్న విమర్శలు రాజకీయ లబ్ధి కోసమేనని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల మద్దతు ఉందని మానవతారాయ్ తెలిపారు.

**బీఆర్ఎస్, బీజేపీల నయవంచనను ఎండగడతాం...**

హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ వరంగల్, హనుమకొండ జిల్లాల ఇన్‌ఛార్జిగా డాక్టర్ కోటూరి మానవతారాయ్ నియామకంతో పార్టీ మరింత బలోపేతమవుతుందని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు దళితులను ఓటు బ్యాంకు రాజకీయాలకు మాత్రమే ఉపయోగించుకుంటున్నాయని ఆరోపించారు. దళితుల పట్ల వివక్షను ప్రజల్లోకి తీసుకెళ్లి, ఆయా పార్టీల నయవంచనను ప్రతి గ్రామం, ప్రతి గడపకూ వెళ్లి ఎండగడతామని స్పష్టం చేశారు. వరంగల్ డీసీసీ అధ్యక్షుడు ఎండీ అయ్యూబ్ మాట్లాడుతూ కాంగ్రెస్ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. విపక్షాల తప్పుడు ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పెరుమాండ్ల రామకృష్ణ, బందెల భద్రయ్య, ఆరూరి సాంబయ్య, వీసం సురేందర్‌రెడ్డి, మహమ్మద్ రహమతుల్లా , హర్షం అశోక్, మేడారపు సుధాకర్‌నేత, అచ్చ వర్ష, రోషన్ గైక్వాడ్, కుమ్మరి రవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం తరపున అందుతున్న పథకాలు, గురించి అవగాహన

- **కల్పించాల్సిన అవసరం మనకు ఎంతైనా ఉంది -జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక**




**నారాయణపేట, సెప్టెంబర్, 11 (సమయం న్యూస్)** నారాయణపేట జిల్లాలో ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్ల లు ఎంతమంది ఉన్నారు, వారి అవసరాలు ఏమిటి, వారికి ప్రభుత్వం తరపున అందుతున్న పథకాలు, సేవలు అనే విషయాలపై తల్లిదండ్రులకు పూర్తి అవగాహన కల్పించాల్సిన అవసరం మనకు ఎంతైనా ఉందనీ జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక తెలిపారు. శుక్రవారం ప్రత్యేక అవసరాలు కలిగిన తల్లి దండ్రులకు అవగాహనా కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.

జిల్లా కేంద్రం లోని యస్ ఆర్ గార్డెన్ లో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథి గా హాజరై విద్యార్థుల తల్లి దండ్రులకు సూచనాలు సలహాలు ఇచ్చారు. ముఖ్యంగా పిల్లలకు రావాల్సిన పెన్షన్ వస్తుందా లేదా, వారు ఏదైనా పాఠశాలకు అనుసంధానమై ఉన్నారా, ఐఆర్పీలు ( IRPs) వారి ఇళ్ల కు వెళ్లి అవసరమైన సేవలు అందిస్తున్నారా అనే విషయాలను అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు.గత కొన్ని రోజుల క్రితం విద్యాశాఖ ఆధ్వర్యంలో పిల్ల లను హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్క్‌కు తీసుకెళ్లడం జరిగిందని, అదే విధంగా ఆసక్తి ఉన్న మరికొంతమంది పిల్లలకు కూడా మరోసారి సందర్శన ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. రాబోయే రెండు వారాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రణాళిక చేసి నిర్వహించాలని సూచించారు. అలాగే, ఈరోజు ఇక్కడ ఉన్న పిల్లలందరికీ పెన్షన్ అందుతుందా లేదా అనే విషయాన్ని అధికారులు, ఐఆర్పీలు ప్రత్యేకంగా పరిశీలించాలని, ఎవరికైనా పెన్షన్ అందకపోతే, వారికి అవసరమైన ధ్రువపత్రాలు, దరఖాస్తు ప్రక్రియపై అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న సదరం, యూడీఐడీ (UDID) క్యాంపులకు పిల్లలను తీసుకెళ్లేందుకు ప్రత్యేకంగా ఒకటి లేదా రెండు రోజులు ప్రణాళిక రూపొందించి ఇంకా ధ్రువపత్రాలు పొందని పిల్లలను గుర్తించి, వారిని క్యాంపులకు తీసుకెళ్లి అవసరమైన ప్రక్రియను పూర్తి చేయించాలన్నారు. అనంతరం అర్హత ఉన్న వారికి పెన్షన్ కోసం దరఖాస్తు చేసే విధంగా చర్యలు తీసుకోవలన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్న ఐఆర్పీలు ప్రతి కుటుంబంతో ప్రత్యేకంగా అనుసంధానమై, అవసరమైన సమాచారాన్ని సేకరించి, పిల్ల లకు అందాల్సిన సేవలు అందేలా చూడాలని, ఈ విషయంలో జిల్లా విద్యాశాఖ అధికారి, డీఆర్డీఓ అధికారులు సమన్వయంతో పని చేయలన్నారు.గత కొన్ని రోజుల క్రితం ఉట్కూర్‌లో నిర్వహించిన వెరిఫికేషన్ సందర్భంగా, ఒక స్వచ్ఛంద సంస్థ సహకారంతో వినికిడి లోపం ఉన్న చిన్నారులకు వినికిడి పరికరాలు అందించడం జరిగిందని పేర్కొన్నారు. మాటలు రాని లేదా వినికిడి సమస్యలు ఉన్న చిన్నారులను గుర్తించి, వారికి అవసరమైన సహాయం అందించడం మనందరి బాధ్యత అని గుర్తు చేశారు. అదేవిధంగా, రేపు 15వ తేదీన అలంకో సంస్థ సహకారంతో మన జిల్లా స్థాయిలో మరో ప్రత్యేక క్యాంపు నిర్వహించబోతున్నమని, ఈ కార్యక్రమంలో అధికారులు, ఐఆర్పీలు, తల్లిదండ్రులు, పిల్లలు తప్పనిసరిగా పాల్గొనాలని, ఇంకా ఈ సమాచారం తెలియని పిల్లలు, కుటుంబాలను కూడా గుర్తించి కార్యక్రమానికి తీసుకురావాలన్నారు. తల్లిదండ్రులకు ప్రత్యేకంగా...ఈ కార్యక్రమానికి వచ్చిన తల్లిదండ్రులందరికీ నా ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాను.పిల్లలను పెంచడం అనేది ప్రతి తల్లిదండ్రికి ఒక గొప్ప బాధ్యత. అయితే ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్ల లను పెంచడానికి మరింత ఓర్పు, సహనం, ప్రేమ, అంకితభావం అవసరం. మీరు చూపిస్తున్న ఆప్యాయత, సహనం, కృషి నిజంగా అభినందనీయం అని కొన్ని ఆడారు.ప్రతి చిన్నారిలోనూ ఏదో ఒక ప్రత్యేక ప్రతిభ, ఆసక్తి లేదా కళ దాగి ఉంటుంది, అది చిత్రలేఖనం కావచ్చు, సంగీతం కావచ్చు, క్రీడలు కావచ్చు, చదువు కావచ్చు లేదా మరేదైనా నైపుణ్యం కావచ్చు.ఆ ప్రతిభను మనం గుర్తించి, పిల్ల లను ప్రోత్సహిస్తే, వారికి తగిన అవకాశాలు కల్పిస్తే, వారు తమ జీవితంలో తప్పకుండా మంచి విజయాలు సాధించగలరని కాబట్టి తల్లి దండ్రులు తమ పిల్ల ల్లో ఉన్న ప్రత్యేక ఆసక్తి, ప్రతిభను గుర్తించి, దానికి అనుగుణంగా వారిని ప్రోత్సహించి, వారి భవిష్యత్తును ఆత్మవిశ్వాసంతో నిర్మించేందుకు మనమందరం కలిసి కృషి చేయాలని, ఇక్కడికి విచ్చేసిన పిల్లలందరికీ, తల్లిదండ్రులందరికీ, అధికారులందరికీ మరోసారి నా శుభాకాంక్షలు తెలుపుతు, ఆ భగవంతుని ఆశీస్సులు మీ అందరిపై ఎల్ల పృథూ ఉండాలని కోరుకుంటూన్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డి ఈ వో గోవిందరాజు, రాజేంద ర్, నాగ రాజ్, నారాయ ణ పేట ఎం.ఈ.ఓ.డి పి ఆర్ ఓ రషీద్ , డాక్టర్ జగదీష్ అపోలో హాస్పిటల్ చిల్డ్రన్ స్పెషలిస్ట్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు...

# సమాచార వ్యవస్థ బలోపేతానికి ప్రత్యేక కృషి

**సమాచార వ్యవస్థ బలోపేతానికి ప్రత్యేక కృషి**

**గోయల్ హైదరాబాద్, సెప్టెంబర్ 11:( సమయం న్యూస్)** సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేసి పారదర్శకతను పెంపొందించాలని కేంద్ర ప్రధాన సమాచార కమిషనర్ రాజ్ కుమార్ గోయల్ సూచించారు. హైదరాబాద్‌లోని ASCIలో తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ ఆధ్వర్యంలో NFICI బోర్డ్ ఆఫ్ గవర్నర్స్, వార్షిక సర్వసభ్య సమావేశాలు నిర్వహించారు. 13 రాష్ట్రాల ప్రధాన సమాచార కమిషనర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ జి. చంద్రశేఖర్ రెడ్డిని NFICI నూతన ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.